మహిళపైనా
'గ్యాంగ్ రేప్' కేసుపెట్టొచ్చు

7

వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

వాయు కాలుష్య నివారణలో
అట్టడుగున భారత్

5

Published From : Rangareddy VOLUME : 01 Issue : 296 Friday, 16-10-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal–Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

ఉగ్రదాడులకు ఇక ఉక్కుపాదమే!

- పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ గట్టి హెచ్చరిక
- దాడులు జరిగితే దీటుగా బదులిస్తాం
- ఉగ్రవాదంపై మారిన భారత్ వ్యూహం
- శాంతిని బలహీనతగా భావించొద్దు
- ఆపరేషన్ సిందూర్‌తో సత్తా చాటిన భారత్
- ఉగ్రవాద మూలాలే లక్ష్యంగా చర్యలు
- దేశ భద్రతకు సైనిక సంసిద్ధత కీలకం
- డిజిటల్ యుగంలో కొత్త ముప్పులపై అప్రమత్తం

02

పది నెలల్లో మోదీ ప్రభుత్వం

కూలిపోతుంది!

- కార్యకర్తలకు రాహుల్ గాంధీ భరోసా
- భయపడొద్దు.. అండగా ఉంటా
- కేంద్రానికి వ్యతిరేకంగా యువత
- బీజేపీలో చేరిన నేతలపై వ్యంగ్యాస్త్రాలు
- ఎన్‌ఎస్‌యూఐ, సేవాదళ్, యూత్ కాంగ్రెస్ శ్రేణులతో టీ పార్టీ
- నిరసనల అనంతరం కార్యకర్తలతో రాహుల్ భేటీ

02

సింగరేణిని ప్రైవేటీకరించే

ప్రసక్తే లేదు

- ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణలను ఖండించిన మంత్రి శ్రీధర్‌బాబు
- సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు ఆందోళన చెందొద్దని భరోసా
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సంస్థకు భారీగా బకాయిలు
- కేసీఆర్ కుటుంబం సింగరేణిని సొంత సంస్థలా మార్చుకుందని విమర్శ
- సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే అసత్య ప్రచారమని ఆరోపణ
- యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తాం
- సింగరేణి ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి

హైదరాబాద్,

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సింగరేణిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. సంస్థ భవిష్యత్తుపై కార్మికులు, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై శ్రీధర్‌బాబు తీవ్ర విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. ఆ ప్రభుత్వ హయాంలో కార్మికులు

-మిగతా 2 లో

02

భారత్‌కు నేపాల్ ప్రధాని

- ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక తొలి విదేశీ పర్యటన
- మూడు రోజుల పర్యటనకు సిద్ధమవుతున్న నేపాల్ ప్రధాని
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు
- భారత సీనియర్ మంత్రులతోనూ సమావేశాలు
- మౌలిక వసతులు, జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చ
- సరిహద్దు సమస్యలపైనా చర్చించే అవకాశం
- వరదల సమయంలో భారత్ అందించిన సాయానికి కృతజ్ఞతలు
- ఇరు దేశాల సంబంధాల బలోపేతంపై దృష్టి

మతం మారితే

రిజర్వేషన్లు కట్

02

యాసంగిలో

వరి వద్దు!

ఎల్‌నినో ప్రభావం కోవిడ్ తరహా సంక్షోభం: సీఎం రేవంత్‌రెడ్డి

- రాష్ట్రంలో తీవ్ర నీటి, విద్యుత్ కొరత తప్పేలా లేదు
- రిజర్వాయర్లలో గతేడాది 400 టీఎంసీలు.. ఇప్పుడు 209 టీఎంసీలే
- అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగిద్దాం
- వచ్చే 8--10 నెలలు అప్రమత్తంగా ఉండాలి
- దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం.. నవంబర్ తొలి వారంలో ఢిల్లీకి
- కేంద్రాన్ని అదనపు విద్యుత్, నిధులు కోరతాం
- రైతులకు అండగా ఉంటాం.. ఉపాధి హామీతో కూలీలకు పని కల్పిస్తాం

తెలంగాణలో సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో నీరు, విద్యుత్ కొరత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో ప్రస్తుతం 209 టీఎంసీల నీరే అందుబాటులో ఉందని, తాగునీటి అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు యాసంగిలో వరి సాగును వాయిదా వేసుకుని, ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపాలని విజ్ఞప్తి చేశారు. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అఖిలపక్ష సహకారంతో కేంద్రం నుంచి అదనపు విద్యుత్, నిధులు సాధించేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు.

02

మాంసం తినే మహిళలు వందేండ్లు బతికే చాన్స్

- వందేళ్లు జీవించే అవకాశంపై చైనా అధ్యయనంలో ఆసక్తికర అంశాలు
- శాకాహారులతో పోలిస్తే 44 శాతం అధిక అవకాశమని వెల్లడి
- 80 ఏళ్లు దాటిన ఐదు వేల మంది మహిళలపై పరిశోధన
- బరువు తక్కువగా ఉన్న మహిళల్లోనే ఈ వ్యత్యాసం
- బరువు ఎక్కువగా ఉన్నవారిలో కనిపించని తేడా
- అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురణ

02

శాకాహారం తినేవారే ఎక్కువ కాలం జీవిస్తారన్న అభిప్రాయానికి భిన్నంగా చైనాకు చెందిన ఓ అధ్యయనం ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. బరువు తక్కువగా ఉన్న మాంసాహార మహిళలు 100 ఏళ్లు జీవించే అవకాశం, శాకాహార మహిళలతో పోలిస్తే 44 శాతం ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. 80 ఏళ్లు దాటిన ఐదు వేల మంది మహిళలపై నిర్వహించిన ఈ పరిశోధన వివరాలు లిఅమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లిలో ప్రచురితమయ్యాయి. అయితే అధిక బరువున్న మహిళల్లో మాత్రం ఈ వ్యత్యాసం కనిపించలేదని అధ్యయనం పేర్కొంది.

విద్యుత్ కోతలకు మీ వైఫల్యమే కారణం!

- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు
- బొగ్గు నిల్వలు సిద్ధం చేయడంలో నిర్లక్ష్యం చేశారని ఆరోపణ
- విద్యుత్ రంగంపై సమీక్షలు నిర్వహించలేదని మండిపాటు
- ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శ
- వైఫల్యాలను అధికారులపైకి నెడుతున్నారని ఆరోపణ
- నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ అదే తీరని వ్యాఖ్య
- ఎల్‌నినోను కోవిడ్‌తో పోల్చడంపై హరీశ్‌రావు అభ్యంతరం
- ప్రభుత్వం తన తప్పిదాలను గుర్తించాలని హితవు

హైదరాబాద్,

తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ విమర్శలు తీవ్రతరమయ్యాయి. రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని విమర్శించారు. అధికారులపై చర్యల హెచ్చరికలు చేసే ముందు పాలనలోని లోపాలను గుర్తించాలని హితవు పలికారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు, సరఫరా సమస్యలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్‌రావు మండిపడ్డారు. అవసరమైన బొగ్గు నిల్వలను ముందుగానే సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు తొమ్మిది నెలలుగా హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. సమస్య తీవ్రతరమైన

-మిగతా 2 లో



02

హిందువులపై సామూహిక కాల్పులకు కుట్ర

- షికాగో సమీపంలో 19 ఏళ్ల యువకుడి అరెస్ట్
- అరోరాలోని హిందూ ప్రార్థనా స్థలమే లక్ష్యంగా పథకం
- హిందువులను పెద్ద సంఖ్యలో చంపాలన్న కుట్ర
- భారతీయులపై ద్వేషంతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు
- కుట్రను గుర్తించి నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన భారత్

సింగరేణి కార్మికుల పొట్టకొట్టిన చరిత్ర

బీఆర్ఎస్‌దే



18 గనుల మూసివేతతో 40 వేల మంది కార్మికులకు అన్యాయం

- పదేళ్ల పాలనలో ఒక్క గనినీ కాపాడలేకపోయారని పొంగులేటి విమర్శ
- గనుల వేలంలో పాల్గొనకుండా సంస్థకు నష్టం చేశారని ఆరోపణ
- మూడు గనుల వేలంలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ రెడ్డి గెలుపే లక్ష్యం కావాలి
- పట్టభద్రుల ఓటు నమోదు, పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి
- వరంగల్ జిల్లాలో 47 వేల మంది పట్టభద్రుల ఓట్లు
- కాంగ్రెస్ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి:

సింగరేణిలో 18 గనులను మూసివేసి 40 వేల మంది కార్మికుల జీవితాలను రోడ్డున పడేసిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. పదేళ్ల పాలనలో ఒక్క గనినైనా కాపాడలేకపోయిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు సింగరేణి విషయంలో మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. గనుల వేలంలో పాల్గొనకుండా సంస్థకు అన్యాయం చేసిన ఆ పార్టీకి ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.

-మిగతా 2 లో

వార్తసంధ్య
www.vaarthasandhya.com

పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది!

- కార్యకర్తలకు రాహుల్ గాంధీ భరోసా
- భయపడొద్దు.. అండగా ఉంటా
- కేంద్రానికి వ్యతిరేకంగా యువత
- బీజేపీలో చేరిన నేతలపై వ్యంగ్యాస్త్రాలు
- ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, యూత్ కాంగ్రెస్ శ్రేణులతో టీ పార్టీ
- నిరసనల అనంతరం కార్యకర్తలతో రాహుల్ భేటీ

న్యూఢిల్లీ:
మరో పది నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూలిపోతుందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. గురువారం ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలతో ఆయన టీ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా భయపడాల్సిన అవసరం లేదని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దేశ యువత కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలుస్తున్నారని రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన నాయకులు సైతం ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూసి బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు వారిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కార్యకర్తల్లో ధైర్యం నింపుతూ, కేంద్ర ప్రభుత్వంపై తన రాజకీయ విమర్శలను కొనసాగించారు.

ఉగ్రదాడులకు ఇక ఉక్కుపాదమే!

న్యూఢిల్లీ:
పాకిస్తాన్ నుంచి భారత్‌పై మరోసారి ఉగ్రదాడి జరిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని స్పష్టం చేశారు. శాంతి, చర్చలకు భారత్ కట్టుబడి ఉన్నంత మాత్రాన దాన్ని బలహీనతగా భావించవద్దని పాకిస్తాన్‌కు తేల్చిచెప్పారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన దేశ భద్రత, ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న వ్యూహంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో భారత్ వైఖరిలో నిర్ణయాత్మక మార్పు వచ్చిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గతంలో దాడులను ఖండించడంతో సరిపెట్టుకునే పరిస్థితి నుంచి, ఉగ్రవాదానికి దీటుగా బదులిచ్చే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. దేశానికి ఎదురవుతున్న ముప్పును మూలాల నుంచే తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్, బాలాకోట్ వైమానిక దాడులు, సర్జికల్ స్ట్రైక్స్ ఇందుకు ఉదాహరణలని పేర్కొన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రక్షణ మంత్రి అన్నారు. దేశంలో శాంతి నెలకొనాలంటే సైనికంగా బలోపేతం కావడంతోపాటు, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. దేశ భద్రత విషయంలో అప్రమత్తత, సంసిద్ధత అత్యంత కీలకమని పేర్కొన్నారు. సంప్రదాయ యుద్ధ ముప్పులతో పాటు డిజిటల్ సాంకేతికత ద్వారా ఎదురవుతున్న సవాళ్లపైనా రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారం వ్యాప్తి, అస్థిరత సృష్టించడం, అంతరాయాలు కలిగించడం, మోసం, విధ్వంసం వంటి ఐదు రకాల ముప్పులు దేశ భద్రతకు సవాలుగా మారుతున్నాయని వివరించారు.

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

మొదటి తరువాయి

అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు మిగిల్చి ఆర్థికంగా నష్టపరిచారని విమర్శించారు. గతంలో సంస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించిన నాయకులు ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే లక్ష్యంతోనే బీఆర్ఎస్ నేతలు ప్రైవేటీకరణపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేని విమర్శలను కార్మికులు, ప్రజలు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణి ప్రయోజనాలను కాపాడిందని, ప్రస్తుతం కూడా సంస్థను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణి ప్రైవేటీకరణపై వస్తున్న ఆరోపణలకు ఆందోళన చెందకుండా, సంస్థ ప్రయోజనాలు మరియు కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం తీసుకునే చర్యలపై విశ్వాసం ఉంచాలని ఆయన సూచించారు.

మతం మారితే రిజర్వేషన్లు కట్

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

, నేషనల్ బ్యూరో:
హిందూ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు మతం మారితే బీసీ రిజర్వేషన్ల ప్రయోజనాలు వర్తించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ సామాజిక వర్గంలో ఉన్న సామాజిక వెనుకబాటుతనం అనేది ఆ వ్యక్తి మతం మారిన తర్వాత ఇతర సామాజిక వర్గాలకు బదిలీ కాదని ప్రశాంత్ కుమార్ మిశ్రా, చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. హిందూ మతం నుంచి ఇస్లాం మతంలోకి మారిన వారికి ప్రత్యేకంగా 'బీసీ ముస్లిం' కేటగిరీ కింద రిజర్వేషన్లు కల్పిస్తూ 2024లో తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు తప్పుపట్టింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే.. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించింది.

హిందువులపై సామూహిక కాల్పులకు కుట్ర

షికాగో, అక్టోబర్ 15
భారతదేశంపై ద్వేషంతో ఇల్లినాయిస్ స్టేట్ షికాగో నగర పరిధిలోని అరోరా ప్రాంతంలో హిందూ ప్రార్థనా మందిరంపై సామూహిక కాల్పులు జరపడానికి కుట్రపన్నిన 19 ఏండ్ల టీనేజర్‌ను యూఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. హిందూ ప్రార్థనా స్థలాన్ని లక్ష్యంగా చేసుకుని సామూహిక కాల్పులు జరపాలని, హిందువులను భారీగా చంపాలని కుట్రపన్నిన అలెగ్జాండ్రోస్ పాపరాకీస్ అనే యువకుడిని అరెస్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు.అతడు భారతీయులపై విద్వేషం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమంలో పలు పోస్ట్‌లు పెట్టినట్టు గమనించారు. శ్వేతజాతి ఆధిపత్య భావజాలాన్ని వ్యక్తం చేస్తూ భారత సంతతి ప్రజలపై హింసను ప్రస్తావించే పత్రాన్ని అతని నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా, యూఎస్‌లోని ప్రార్థనా మందిరం వద్ద సామూహిక కాల్పులకు జరిగిన కుట్రపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

భారత్‌కు నేపాల్ ప్రధాని

-ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక తొలి విదేశీ పర్యటన
-మూడు రోజుల పర్యటనకు సిద్ధమవుతున్న నేపాల్ ప్రధాని
-ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు
-భారత సీనియర్ మంత్రులతోనూ సమావేశాలు
-మౌలిక వసతులు, జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చ
-సరిహద్దు సమస్యలపైనా చర్చించే అవకాశం
-వరదల సమయంలో భారత్ అందించిన సాయానికి కృతజ్ఞతలు
-ఇరు దేశాల సంబంధాల బలోపేతంపై దృష్టి

నేషనల్ బ్యూరో:
నేపాల్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన బాలేంద్ర షా నవంబర్‌లో భారత్‌లో పర్యటించనున్నారు. ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనకు ఇదే తొలి అధికారిక విదేశీ పర్యటన కానుంది. మార్చిలో బాధ్యతలు చేపట్టిన ఆయన, మూడు రోజుల పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు సీనియర్ మంత్రులతో సమావేశమై ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నారు. గతంలో నేపాల్ ప్రధానులుగా బాధ్యతలు చేపట్టిన పలువురు నేతలు తమ తొలి విదేశీ పర్యటనకు చైనాను ఎంచుకోగా, బాలేంద్ర షా భారత్‌కు రావాలని నిర్ణయించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనలో ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడం, పరస్పర సహకారాన్ని విస్తరించడం వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. మౌలిక వసతుల అభివృద్ధి, జలవిద్యుత్ ప్రాజెక్టులు, సరిహద్దు సమస్యలు ప్రధాన చర్చనీయాంశాలుగా ఉండనున్నాయి. ఇరు దేశాలకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాంతీయ సహకారంపై కూడా చర్చలు జరిగే అవకాశం ఉంది. ఇటీవల ఆగస్టులో భోటెకోషి ప్రాంతంలో సంభవించిన వరదల అనంతరం భారత్ నేపాల్‌కు 130 టన్నులకు పైగా సహాయ సామగ్రిని పంపించింది. సహాయక చర్యల కోసం రెస్క్యూ సిబ్బందిని కూడా అందించింది. ఈ సహాయానికి నేపాల్ ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. బాలేంద్ర షా పర్యటనతో భారత్--నేపాల్ సంబంధాల్లో కీలక అంశాలపై చర్చలకు అవకాశం ఏర్పడనుంది.

యాసంగిలో వరి సాగు వద్దు!

-రాష్ట్రంలో తీవ్ర నీటి, విద్యుత్ కొరత తప్పేలా లేదు
-రిజర్వాయర్లలో గతేడాది 400 టీఎంసీలు.. ఇప్పుడు 209 టీఎంసీలే
-అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగిద్దాం
-వచ్చే 8--10 నెలలు అప్రమత్తంగా ఉండాలి
-దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం.. నవంబర్ తొలి వారంలో ఢిల్లీకి
- కేంద్రాన్ని అదనపు విద్యుత్, నిధులు కోరతాం
-రైతులకు అండగా ఉంటాం.. ఉపాధి హామీతో కూలీలకు పని కల్పిస్తాం

హైదరాబాద్,
సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం తీవ్ర నీటి, విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ విపత్తు కోవిడ్ తరహాలో ప్రజల జీవితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. యాసంగిలో వరి సాగును వాయిదా వేసుకోవాలని, నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని ఆరుతడి పంటలకే పరిమితం కావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో గతేడాదితో పోలిస్తే నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గురువారం మంత్రులతో ఎల్‌నినో పరిస్థితులపై సమీక్ష నిర్వహించిన అనంతరం సచివాలయంలో సీఎం మీడియాతో మాట్లాడారు. శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరిస్తున్న ఈ ప్రకృతి విపత్తును తేలిగ్గా తీసుకోలేమన్నారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 100 దేశాల్లో ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోందని, రాష్ట్రంలోనూ సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని చెప్పారు. రాబోయే 8 నుంచి 10 నెలలపాటు ప్రభావం కొనసాగే అవకాశం ఉన్నందున ప్రభుత్వ శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని సూచించారు. గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని రిజర్వాయర్లలో 400 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు సుమారు 72 శాతం, గోదావరి బేసిన్‌లో 40 శాతం మేర తగ్గినట్లు వివరించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తాగునీరు అందించాల్సిన అవసరం ఉన్నందున నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని చెప్పారు. రానున్న నెలలు అత్యంత కీలకమని, మళ్లీ వర్షాలు వచ్చే వరకు నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. నీటి కొరత వ్యవసాయంతోపాటు పరిశ్రమలపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గతంలో సుమారు 14 వేల మెగావాట్ల స్థాయి నుంచి ప్రస్తుతం 20 వేల మెగావాట్లకు చేరిందని తెలిపారు. రైతులు ఇప్పటికే సాగు చేసిన పంటలు నష్టపోకుండా ఉండేందుకు అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అయితే నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున యాసంగిలో వరి సాగును తగ్గించాలని, ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పంటలు వేయకుండా ఉండే రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం నిర్వహించి, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని తెలిపారు. నవంబర్ తొలి వారంలో తన నేతృత్వంలో అఖిలపక్ష ప్రతినిధులతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వాన్ని అదనపు విద్యుత్, అవసరమైన నిధులు కోరనున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా విపక్షాలు ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు సీఎం తెలిపారు. ఐఏఎస్ అధికారి రామకృష్ణారావుకు సంబంధిత బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంతోపాటు, ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ కూలీలకు పని కల్పించే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు

విద్యుత్ కోతలకు మీ వైఫల్యమే కారణం!

మొదటి తరువాయి

తర్వాత అధికారులను సస్పెండ్ చేస్తామంటూ హెచ్చరించడం సరికాదని వ్యాఖ్యానించారు. నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తన తప్పిదాలను అధికారులపైకి నెట్టిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాలు, ముందస్తు ప్రణాళికల్లో లోపాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని కోవిడ్ తరహా సంక్షోభంతో ముఖ్యమంత్రి పోల్చడంపైనా హరీశ్‌రావు స్పందించారు. ప్రకృతి విపత్తును ఎదుర్కోవడానికి ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎల్‌నినో కంటే ప్రభుత్వ పాలనే పెద్ద విపత్తుగా మారిందంటూ విమర్శించారు. అధికారులపై చర్యల హెచ్చరికలు చేసే బదులు, విద్యుత్ సంక్షోభానికి దారితీసిన కారణాలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సింగరేణి కార్మికుల పొట్టకొట్టిన చరిత్ర బీఆర్ఎస్‌దే

మొదటి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మూడు గనుల వేలంలో పాల్గొని సింగరేణిని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. వరంగల్‌లో గురువారం నిర్వహించిన వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఉమ్మడి వరంగల్ జిల్లా సన్నాహక సమావేశంలో పొంగులేటి ప్రసంగించారు. మూడు ఉమ్మడి జిల్లాల్లోని 34 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను సీపీఐతో కలిసి 32 స్థానాల్లో కాంగ్రెస్ పక్షం బలంగా ఉందని చెప్పారు. మిగిలిన రెండు నియోజకవర్గాల్లోనూ గతంలో కాంగ్రెస్‌కు గట్టి పట్టు ఉండేదని గుర్తుచేశారు. ఈ రాజకీయ బలాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంగా మలుచుకోవాలని, కాంగ్రెస్ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టభద్రులను నేరుగా కలిసి మొదటి ప్రాధాన్య ఓటు సర్వోత్తమ రెడ్డికి వేసేలా ప్రచారం నిర్వహించాలని అన్నారు. వచ్చే నెల 6వ తేదీ వరకు ఓటు నమోదు, పునరుద్ధరణకు అవకాశం ఉన్నందున దసరా తదితర పండుగలకు స్వగ్రామాలకు వచ్చే పట్టభద్రులను గుర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్క వరంగల్ జిల్లాలోనే సుమారు 47 వేల మంది పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలని పొంగులేటి అన్నారు. ఎన్నికలకు ముందుగానే కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడం పార్టీ సన్నద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రజలకు అనుకూలంగా పనిచేయాలంటే కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలని మంత్రి అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటానికి ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితరులు మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా ఈ పోరాటానికి మరింత బలం చేకూర్చాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ పరస్పర అవగాహనతో పనిచేస్తున్నాయని విమర్శించిన ఆయన, ఆ పార్టీల రాజకీయ వ్యూహాలను కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని సూచించారు. సర్వోత్తమ రెడ్డి విజయమే లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు

మాంసం తినే మహిళలు వందేండ్లు బతికే చాన్స్

-వందేళ్లు జీవించే అవకాశంపై చైనా అధ్యయనంలో ఆసక్తికర అంశాలు
-శాకాహారులతో పోలిస్తే 44 శాతం అధిక అవకాశమని వెల్లడి
-80 ఏళ్లు దాటిన ఐదు వేల మంది మహిళలపై పరిశోధన
-బరువు తక్కువగా ఉన్న మహిళల్లోనే ఈ వ్యత్యాసం
-బరువు ఎక్కువగా ఉన్నవారిలో కనిపించని తేడా
-అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురణ



బీజింగ్
మాంసాహారం తినే మహిళలు వందేళ్లు జీవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చైనాలో నిర్వహించిన ఓ అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా బరువు తక్కువగా ఉన్న మాంసాహార మహిళలు, శాకాహారం తీసుకునే మహిళలతో పోలిస్తే వందేళ్లు జీవించే అవకాశం 44 శాతం అధికంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే, ఈ ఫలితాలు అన్ని మహిళలకూ వర్తిస్తాయని భావించకూడదని, అధ్యయనంలో గుర్తించిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చైనీస్ లాంగిట్యూడినల్ హెల్తీ లాంగివిటీ సర్వేలో భాగంగా 80 ఏళ్లు దాటిన సుమారు ఐదు వేల మంది మహిళల ఆరోగ్య వివరాలను పరిశీలించారు. వారి ఆహారపు అలవాట్లు, శరీర బరువు, దీర్ఘాయుష్షు మధ్య ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేశారు. ఈ పరిశోధన ఫలితాలు అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురితమయ్యాయి. అధ్యయనం ప్రకారం, బరువు తక్కువగా ఉన్న మహిళల్లో మాంసాహారం తీసుకునేవారు వందేళ్ల వరకు జీవించే అవకాశంలో శాకాహారులతో పోలిస్తే ఎక్కువగా ఉన్నారు. అయితే, అధిక బరువు ఉన్న మహిళల్లో శాకాహారం, మాంసాహారం తీసుకునేవారి మధ్య ఇలాంటి వ్యత్యాసం కనిపించలేదు. గతంలో శాకాహారం తీసుకునేవారే ఎక్కువ కాలం జీవిస్తారనే అభిప్రాయాలు కొన్ని అధ్యయనాల్లో వ్యక్తమయ్యాయి. తాజా పరిశోధన మాత్రం ఆహారపు అలవాట్లతో పాటు శరీర బరువు, వయసు, మొత్తం ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ఈ ఒక్క అధ్యయనం ఆధారంగా మాంసాహారమే దీర్ఘాయుష్షుకు కారణమని నిర్ధారించలేం.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: గంప గోవర్ధన్

ఎండిన పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వార్త సంధ్య): అక్టోబర్15
కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విద్యుత్ సరఫరా విషయంలో అధికారులను సస్పెండ్ చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేశామని, రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7 వేల మెగావాట్ల నుంచి 20 వేల మెగావాట్లకు పెంచామని తెలిపారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఎండిపోతున్న పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించి పంటలను కాపాడాలని కోరారు. అలాగే బొగ్గు తరలింపుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని గంప గోవర్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చాగంటి సీతమ్మ చిత్రపటానికి ఘన నివాళులు

మాజీ సొసైటీ డైరెక్టర్ చాగంటి కోటయ్య కుటుంబాన్ని పరామర్శించిన రావూరి, వీరన్న, పాండ్యా, కోలేటి

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 15 (వార్త సంధ్య):
కారేపల్లి మండల పరిధిలోని కొత్త కమలాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ సొసైటీ డైరెక్టర్ చాగంటి కోటయ్య తల్లి సీతమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి పలువురు నాయకులు హాజరై మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మండల నాయకులు అజ్మీర వీరన్న, మాజీ ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ధరావత్ పాండ్యా నాయక్, సొసైటీ డైరెక్టర్ కోలేటి రాధాకృష్ణ పాల్గొన్నారు. అనంతరం మృతురాలి కుమారుడు, మాజీ సొసైటీ డైరెక్టర్ చాగంటి కోటయ్యతో పాటు ఆయన సోదరులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్ట సమయంలో వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతుబంధు కన్వీనర్ గుగులోతు శ్రీనునాయక్, తోటకూరి వెంకటేశ్వర్లు, కొత్త తిరుపతయ్య, దుద్దిపాళ్ల భాస్కరరావు, గుగులోతు హరినాయక్, వెంకయ్య, రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొని మృతురాలికి నివాళులర్పించారు.

సేవా సంకల్ప అభియాన్' రహదారి భద్రతపై విస్తృత అవగాహన

వార్త సంధ్య కూకట్‌పల్లి :
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని వై జంక్షన్ జాతీయ రహదారిపై గురువారం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేపట్టారు. రహదారి నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రయాణికులకు, వాహనదారులకు చైతన్యం కలిగించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: ఆనంద్ గౌడ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు శేఖర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ, "ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత. రహదారి భద్రత అనేది మనందరి సామాజిక బాధ్యత" అని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో వెళ్లేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, సిగ్నళ్లను గౌరవిస్తూ అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించడం వల్ల అమూల్యమైన ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేవా కార్యక్రమాలే 'సేవా సంకల్ప అభియాన్' లక్ష్యం: వడ్డేపల్లి రాజేశ్వరరావు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడం మరియు సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి విలువైన సందేశాన్ని అందించడమే 'సేవా సంకల్ప అభియాన్' ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవడమే కాకుండా, ఇతరులలో కూడా చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా నాయకులు, కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: జిల్లా కలెక్టర్

ఉమ్మడి వరంగల్, అక్టోబర్ 15 (వార్త సంధ్య):
భారీ వాహనాలు ప్రైవేట్ టాక్సీలను రోడ్ల పక్కన పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ బాయ్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. హసన్పర్తి రహదారిపై లైన్ మార్కింగ్ , స్టడీస్ ఏర్పాటు చేయాలని, వంగపహాడ్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

రూ.1.20 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ విద్యుత్ ఏఈ!

-ఆరు కొత్త విద్యుత్ మీటర్ల మంజూరుకు లంచం డిమాండ్
-హైదరాబాద్ పాతబస్తీలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

హైదరాబాద్, అక్టోబర్ 15 (వార్త సంధ్య)
హైదరాబాద్ పాతబస్తీలో విద్యుత్ శాఖకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడినట్లు సమాచారం. సంతోష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మదన్నపేట సెక్షన్‌కు చెందిన TGSPDCL ఏఈ రాకేష్ ఆరు కొత్త విద్యుత్ మీటర్ల మంజూరు కోసం రూ.1,20,000 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా ఆరు విద్యుత్ మీటర్లు మంజూరు చేయడానికి ఏఈ రాకేష్ రూ.1.20 లక్షలు లంచంగా అడిగినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందడంతో వారు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

డబ్బు తీసుకుంటుండగా పట్టివేత
లంచం సొమ్ము తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు ఏఈని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారుల అధికారిక ప్రకటన, కేసు వివరాలు, తదుపరి చర్యలపై పూర్తి సమాచారం వెల్లడికావాల్సి ఉంది.

డిసెంబర్ 18 నుంచి 39వ హైదరాబాద్ బుక్ ఫెయిర్!



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 15
సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో యాకూబ్ కవి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు అధ్యక్షులుగా రాంపల్లి రమేష్ నవ తెలంగాణ పబ్లిషర్స్ హౌస్ ఉపాధ్యక్షులుగా కే బాల్ రెడ్డి మలుపు బుక్స్ ఉపాధ్యక్షులుగా సోంబాబు తెలుగు బుక్స్ కార్యదర్శిగా పి.నారాయణరెడ్డి నవచేతన పబ్లిష్ హౌస్ సంయుక్త కార్యదర్శిగా రజిని జై భారత్ పబ్లిషెన్స్ కోశాధికారిగా కె సురేష్ మంచి పుస్తకం కార్యనిర్వాహక సభ్యులుగా యాకూబ్ కవి విజయ రామారావు నవతెలంగాణ బుక్ హౌస్ ఇన్ మధుకర్ నవచేతన బుక్ హౌస్ గీత రామస్వామి హైదరాబాద్ బుక్స్ ట్రస్ట్ ఎన్ కోటేశ్వరరావు నవోదయ బుక్స్ హౌస్ ఎం సూరిబాబు సత్య సూర్యనారాయణ క్రియేటివ్ బుక్స్ లింక్స్ యు శ్రీనివాసరావు బుక్ భూమి బుక్ ట్రస్ట్ కె సంజయ్ ప్రణవ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యనిర్వాక వర్గాన్ని తెలియజేశారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రాంపల్లి రమేష్ మాట్లాడుతూ 39వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ని డిసెంబర్ 18 నుంచి 28 వరకు 11 రోజులపాటు నిర్వహించాలని నిర్ణయించామని ఆయన తెలిపారు రచయితలకు దరఖాస్తులను ఆన్లైన్లో స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.తెలంగాణ కళాభారతి ఎన్టీఆర్ స్టేడియంలో ఈ 11 రోజుల పుస్తక పండుగ జరగనుందని ఆయన తెలిపారు కార్యదర్శి పి నారాయణ రెడ్డి మాట్లాడుతూ పుస్తక ఆవిష్కరణలు బాల సాంస్కృతిక సాహిత్య కార్యక్రమాలు జరుగుతాయని సాహిత్యవేతలు పాత్రికేయులు పుస్తక ప్రియులు వాళ్లతో బుక్కు కార్యక్రమం ఉంటుందని ఆయన తెలియజేశారు ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు బాల్ రెడ్డి సంయుక్తకార్యదర్శి రజిని కోశాధికారి కే సురేష్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు

ఆధునిక న్యూరోసర్జరీ సేవలు అందిస్తున్న యశోద హాస్పిటల్స్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 15
సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్‌లోని సెంటర్ ఫర్ న్యూరోఎండోస్కోపీ అండ్ రోబోటిక్ న్యూరోసర్జరీ ద్వారా మెదడు, వెన్నెముక సమస్యలకు అత్యాధునిక చికిత్సలు అందిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు డా. అయ్యదురై ఆర్, డా. కృష్ణ తేజ్ రెడ్డి తెలిపారు.న్యూరోఎండోస్కోపీ, రోబోటిక్ సాంకేతికతతో మెదడు కణితులు, మూర్ఛ, ట్రైజెమినల్ న్యూరల్జియా, మెదడులో రక్తస్రావం, వెన్నెముక సమస్యలకు అవసరాన్ని బట్టి కనిష్ట ఇన్వాసివ్ శస్త్రచికిత్సలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ట్రైజెమినల్ న్యూరల్జియాకు సంబంధించి ఇప్పటివరకు 110 శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఆధునిక వైద్య సాంకేతికతతో రోగులకు మెరుగైన చికిత్స అందించడం, త్వరగా కోలుకునేలా చేయడం తమ లక్ష్యమని వివరించారు.

చెత్త సేకరణ ప్రైవేటీకరణను ఆపాలి!

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 15.
గురువారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో జిహెచ్ఎంసి సిఎంసి ఎం సి ఎం ఎం సి స్వచ్ఛ ఆటో టిప్పర్లు రిక్షా డ్రైవర్లు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆయన విలేకరుల సమావేశంలో మీ ఇండ్ల నుంచి చెత్తను సేకరించే కార్మికుల గురించి ఆలోచించండి అని మన పరిసర పరిశుభ్రంగా ఉంటేనే కార్మికుల ఉపాధి భద్రత వారి ఆరోగ్య రక్షణ లేదా వారి శ్రమకు తగ్గ గౌరవం లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు స్వయం ఉపాధిని కాపాడండి ప్రైవేటు టీ కన్ను అడ్డుకోండి అని ఆయన పిలుపునిచ్చారు ఇప్పుడు 26వేల 500 మంది కార్మికుల వాహనాలను ప్రవేటు సంస్థ అయినా రాంకీ ఆధీనం తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతున్నాయని వాటిని వెంటనే తక్షణం ముఖ్యమంత్రి చర్యలు తీసుకుని విరమింపజేయాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ చెత్త కార్మికులను వారి హక్కులను కాపాడవలసిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉందని చెప్పారు చెత్త సేకరణ ప్రైవేటీకరణ జరిగితే తీవ్రమైన చర్యలు ఉంటాయని ఆయన హె హెచ్చరించారు.కార్మికులకు స్వయం ఉపాధి దెబ్బతీస్తుందని వాహనంపై చేసిన పెట్టుబడులు అప్పుల భారం కార్మికులను వేధిస్తాయని సైక్లింగ్ ద్వారా లభిస్తున్న అదనపు ఆదాయం కోల్పోతారని కార్మికుల జీవనోపాధిపై ప్రైవేటు సంస్థల నియంత్రణ పెరిగిపోతుందని ప్రజలపై అధిక భారం పెంచవద్దని ఆయన కోరారు కార్మికుల జీవితాలు ఆరోగ్యాలు బాధ్యత ప్రభుత్వం తీసుకొని వారికి కార్మికుల కోసం ఈఎస్ఐ సదుపాయం కల్పిస్తూ వారిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు నగర పరిశుభ్రత కోసం శ్రమించే కారణకు కార్మికులకు ఆరోగ్య భద్రత గౌరవపదమైన జీవితం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన చెప్పారు కార్మిక సలహాదారు వర్గీస్ మాట్లాడుతూ స్వయం ఉపాధి రక్షణ ప్రత్యేక సంక్షేమం బోర్డు పరిహారం అంగవైకల్యానికి 10 లక్షలు చెల్లించాలని మరణించిన కార్మికుల కుటుంబాలకు 30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు నాణ్యమైన కొత్త వాహనాలు పాత పడ్డ దెబ్బతిన్న ఆటోలో టిప్పర్లు కొత్త వాహనాలు కొనుగోలు చేయాలని ప్రత్యేక అధికారిని కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసి ప్రభుత్వ అధికారులు నియమించాలని ఆయన డిమాండ్ చేశారు కార్మికుల పక్షాన నేత ఆలకుంట రాములు మాట్లాడుతూ కార్మికులకు బీమా సదుపాయాలు ఆరోగ్య ప్రమాద జీవిత బీమా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ వాహన వాహన గ్రాంటు ప్రతి వాహనానికి ఏట 25000 నిర్వహణ గ్రాండ్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు గౌ ఆత్మగౌరవం కార్మికుల గౌరవప్రదంగా సంబోధించాలని చెత్త అమ్మాయి చెత్త అబ్బాయి అనకూడదని ఈ సమావేశంలో గోపి హైమా ఏ రాము పి కృష్ణ స్వచ్ఛ ఆటో టిప్పర్లు ఆటో డ్రైవర్ కమిటీ జిహెచ్ఎంసి రాంకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు

పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలె!

-అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

మునుగోడు అక్టోబర్ 15 (వార్త సంధ్య):
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలని కోరారు. మునుగోడులోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, అనుగుల రాకేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టభద్రులందరూ ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామాలు, మండలాల వారీగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఓటరు నమోదు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయని వారు గుర్తుచేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పనిచేసిందని పేర్కొంటూ, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల పార్టీ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే..

- శేరిగూడెంసర్పంచ్ పి.ప్రభాకర్ యాదవ్

గట్టుప్పల్..అక్టోబర్ 15 (వార్త సంధ్య):
వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని సర్పంచ్ పి.ప్రభాకర్ యాదవ్ అన్నారు గురువారం గట్టుప్పల మండల పరిధిలో శేరీగూడెం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు పేద ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా లేని లోటు ప్రజలకు ఔపిస్తుందని అన్నారు.. వర్గాల ప్రజలందరూ కెసిఆర్ ని మళ్లీ సీఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.. జరగనున్న పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అహర్నిశలు కృషి చేశారని ధీమా వ్యక్తం చేశారు

ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా ముగిసిన సీఐఎస్‌సీఈ జాతీయ అథ్లెటిక్స్ పోటీలు

-870 మంది బాలికల ప్రతిభా ప్రదర్శన.. రికార్డులు బద్దలు

అక్టోబర్ 15 (వార్త సంధ్య):
హబ్సిగూడ సెయింట్ జోసెఫ్ పాఠశాల ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌పై మూడు రోజులపాటు నిర్వహించిన సీఐఎస్‌సీఈ 7వ జాతీయ బాలికల అథ్లెటిక్స్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 15 ప్రాంతాలకు చెందిన సుమారు 870 మంది బాలికలు పాల్గొన్నారు. ట్రాక్, ఫీల్డ్, జంపింగ్ విభాగాల్లో పోటీపడిన పలువురు క్రీడాకారిణులు గత రికార్డులను అధిగమించడం విశేషం.ముగింపు వేడుకలకు ఏఐఎస్ఎస్‌సీ కార్యదర్శి, కోశాధికారి ఫాదర్ ఎస్. జోసెఫ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా, అంతర్జాతీయ అథ్లెట్ ఎం. కల్పనా రెడ్డి, డాక్టర్ గాడ్విన్ డేనియల్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు, ఛాంపియన్‌షిప్ ట్రోఫీలు అందజేశారు. స్వర్ణ, రజత పతక విజేతలతో సీఐఎస్‌సీఈ జట్టును ఏర్పాటు చేసి ఎస్‌జీఎఫ్ఐ స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్పోర్ట్స్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ థెరిసా తెలిపారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యం, కోచ్‌లు, నిర్వాహకులను ఆమె అభినందించారు.

భవానీమాత ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

షాద్‌నగర్, అక్టోబర్ 15 (వార్త సంధ్య):
సోలిపూర్ గ్రామంలోని భవానీమాత ఆలయాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మాజీ చైర్మన్ అగ్గనూర్ విశాల, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోట మైసమ్మ జాతర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన

ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

-ఐదు రోజులపాటు వైభవంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

-ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ జాతరకు లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 15 (వార్త సంధ్య):
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ కోట మైసమ్మ తల్లి దసరా జాతర మహోత్సవాల సందర్భంగా రూపొందించిన క్యాలెండర్‌ను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ బుధవారం ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త, ఎండోమెంట్ కోట మైసమ్మ తల్లి ఆలయ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఐదు రోజులపాటు నవరాత్రి ఉత్సవాలు

కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తుల విశ్వాసాన్ని పొందిన కోట మైసమ్మ తల్లి ఆలయంలో ప్రతి సంవత్సరం దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఐదు రోజులపాటు జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం

రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన కోట మైసమ్మ తల్లి జాతరకు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా జాతర ప్రాంగణాన్ని సిద్ధం చేస్తూ, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు.

జాతరలో ప్రత్యేక ఆకర్షణగా వినోద, వ్యాపార దుకాణాలు

జాతరలో భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా జెయింట్ వీల్స్, పూజా సామగ్రి దుకాణాలు, పిల్లల ఆటబొమ్మల దుకాణాలు, మిఠాయిలు, తినుబండారాల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వివిధ రకాల వినోద కార్యక్రమాలు, వ్యాపార దుకాణాలతో జాతర ప్రాంగణం సందడిగా మారనుంది.ఐదు రోజులపాటు కొనసాగే ఉత్సవాల్లో భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియనున్నాయి. కోట మైసమ్మ తల్లి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

-ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబర్ 15 (వార్త సంధ్య):
దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నారం ప్రాంతంలో అమ్మవారి 26వ వార్షికోత్సవం, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్, తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అరిగే ఐలేష్ కుర్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో రాచకొండ సతీష్, ఎలిమినేటి ప్రవీణ్ గౌడ్, ఎలిమినేటి మధు గౌడ్, ఎలిమినేటి జంగా గౌడ్, చేగూరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు భక్తిభావంతో వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథుల రాకతో నిర్వాహకులు, భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను, భక్తిభావాన్ని పెంపొందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

9వ ఫేజ్ నూతన కార్యవర్గాన్ని అభినందించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్

వార్త సంధ్య కూకట్‌పల్లి:
కేపీహెచ్‌బీ 9వ ఫేజ్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమ దుర్గాభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ఆయనకు పరిచయమై, కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, మౌలిక సదుపాయాల అవసరాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. కాలనీల పురోగతిలో సంక్షేమ సంఘాల పాత్ర అత్యంత కీలకమని, సీనియర్ సిటిజన్ల అనుభవం, మార్గదర్శకత్వంలో యువత భాగస్వామ్యంతో ముందుకు సాగాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా కాలనీ వాసులందరూ ఐకమత్యంతో పనిచేస్తూ, కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌ను పరిశుభ్రమైన, సురక్షితమైన ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సభ్యులు జి. రామకృష్ణారెడ్డి, కె. రాహుల్, కె. చంద్ర మోహన్ రెడ్డి, ఎం. వీర గోవిందరావు, ఎన్. తిలక్ కుమార్, కృష్ణార్జున రెడ్డి, ఈశ్వర రెడ్డి, పి.వి. సత్యనారాయణ, యాదిరెడ్డి, వై. వెంకటరత్నం, విజయ్ కుమార్, ఈశ్వర్ రెడ్డి, నాగేశ్వరరావు, రామకృష్ణ రాజు, మధుసూదన్ రెడ్డి, చారి, నందయ్య, బాబూరావు, బి. వెంకటేశ్వరరావు, కిల్లారు శ్రీనివాస్ బాబు, చావా శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేని కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్

ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలి

-ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి (పివీ పిఎస్), తెలంగాణ.

– 35 మంది తొలగింపు కేవలం కంటితుడుపు చర్యే -- లక్షలాది మంది నిరుద్యోగుల పక్షాన పివిపిఎస్ డిమాండ్.

నిరుద్యోగుల సమస్య తీర్చాలి

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 15.

గత ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధమైన జీవో. 16 ద్వారా చేపట్టిన కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియలో ఎంతటి భారీ కుంభకోణం దాగి ఉందో ఇటీవల వెలుగు చూసిన నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం స్పష్టం చేస్తోందని ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి పివిపిఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఎలాంటి పోటీ పరీక్షలు లేకుండా, కేవలం బ్యాక్ డోర్ పద్ధతిలో కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయడం వల్ల ఎన్నో ఏళ్లుగా రాత్రింబవళ్లు చదువుతూ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది ప్రతిభావంతులను, పీజీ/పీహెచ్‌డీ అర్హతలున్న నిరుద్యోగ యువతను ఘోరంగా దగా చేశారని పీవీపీఎస్ మొదటి నుంచీ హెచ్చరిస్తూనే ఉంది. ఇప్పుడు ఇంటర్ బోర్డు విచారణలో 35 మంది లెక్చరర్లు నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందినట్లు తేలడం, వారిని డిస్మిస్ చేయడం తాము చేసిన ఆరోపణలను 100% నిజం నిరూపించిందని సమితి పేర్కొంది.

పివీ పీఎస్ డిమాండ్లు ముఖ్యాంశాలు:

– మొత్తం రెగ్యులరైజేషన్ ప్రక్రియపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: కేవలం 35 మందిని తొలగించి చేతులు దులుపుకుంటే సరిపోదు. 2023లో జరిగిన మొత్తం 2,532 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై సిట్టింగ్ జడ్జితో లేదా విజిలెన్స్ శాఖతో సమగ్ర విచారణ జరిపించాలి. ఈ స్కామ్‌లో నకిలీలు ఇంకా చాలా మంది ఉన్నారని పివిపిఎస్ అనుమానిస్తోంది.

-అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: కనీస బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ ధృవీకరణ పత్రాల పరిశీలన లేకుండానే అక్రమార్కులకు రెగ్యులర్ ఆర్డర్స్ ఇచ్చిన ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు, ప్రాంతీయ అధికారుల ఆర్జెడి కన్సల్టెన్సీల పాత్రపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారిని వెంటనే అరెస్ట్ చేయాలి.

– టీజీపీఎస్సీ ద్వారానే ప్రత్యక్ష నియామకాలు చేపట్టాలి: అక్రమ పద్ధతుల్లో జరిగిన రెగ్యులరైజేషన్లను పక్కన పెట్టి, జూనియర్ లెక్చరర్లు జేఎల్, డిగ్రీ లెక్చరర్లు డి ఎల్ పోస్టులన్నింటినీ కేవలం ౦+ూజ ద్వారా పారదర్శకంగా నోటిఫికేషన్లు విడుదల చేసి ప్రత్యక్ష నియామకాల ద్వారానే భర్తీ చేయాలి. అప్పుడే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుంది.

– నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడొద్దు: విద్యా ప్రమాణాలను తుంగలో తొక్కి, నకిలీ సర్టిఫికెట్లు ఉన్న వారికి ప్రభుత్వ జీతాలు చెల్లిస్తూ, నిజమైన నిరుద్యోగులను రోడ్డున పడేసే ఏ చర్యలనైనా పి వి పి ఎస్ సహించబోదని, నిరుద్యోగ యువత హక్కుల కోసం కోర్టులలో మరియు క్షేత్రస్థాయిలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది.

తెలంగాణలోని నిరుద్యోగ జెఎసి జేఏసీ విద్యార్థి సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వ విద్యా వ్యవస్థను, నిరుద్యోగుల ఉపాధి హక్కులను కాపాడుకోవడానికి ఈ పోరాటంలో కలిసి రావాలని పివిపిఎస్ పిలుపునిచ్చింది.

భవదీయుడు,సైదుల్ రెడ్డి జీడిపల్లి
ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి పివిపిఎస్, తెలంగాణ.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సంపాదకీయం

ఇది ఇంతటితో ఆగేలా లేదు

'గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవడం' అనే పచ్చి సామెతను తలపిస్తోంది దేశంలో ప్రస్తుత పరిస్థితి. 'సర్' ప్రక్రియపై మొదట్నుంచి అనుమానాలున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీల ఎన్నికల సందర్భంగా విపక్షాలనుంచి ఎన్నో విమర్శలు, నిర్దిష్ట ఆరోపణలు వచ్చినప్పటికీ ఎన్నికల కమిషన్ చర్యల్ని తప్పుబట్టగల ఆధారాలు అప్పట్లో లేవు. ఇప్పుడిప్పుడే ఒకటొకటిగా అన్నీ బయటకు వస్తున్నాయి. ఇసిలో ఏకాభిప్రాయం లేదని, సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలే ఏడాది కాలంగా అమలవుతున్నాయన్న మీడియా పరిశోధనాత్మక కథనం తర్వాత నిరసన దేశవ్యాప్తంగా పెల్లుబికింది. రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యార్థులు, యువతరం, మేధావివర్గం, ప్రజాస్వామ్యవాదులు.. ఇలా విభిన్న వర్గాల వారు ఏకకంఠంతో గొంతెత్తారు. ముంబై, కోల్‌కతా, హైదరాబాద్.. ఇలా పెద్ద నగరాలకూ నిరసన వేడి విస్తరించింది. సిఇసి దిగిపోవాలని, 'సర్' రద్దు చేయాలని, చట్టవ్యతిరేక 'సర్' అమలుతో జరిగిన తప్పుడు ఎన్నికల్ని సమీక్షించాలన్న డిమాండ్‌ను నిరసనకారులు తెరపైకి తెచ్చారు. ప్రజాందోళన రోజోరోజుకు బలపడుతూ వచ్చింది. ఢిల్లీలో నిరసన అణచివేత చర్యల్ని సుప్రీం కోర్టు తప్పుపట్టింది. పోలీసులకు పట్టినట్టు లేదు. కోర్టు చెప్పినా నిర్బంధ ఒరవడి ఇంకా కొనసాగుతూనే ఉంది. రద్దు చెల్లుబాటయ్యేనా? దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరపడాన్ని పూర్తిగా నిషేధిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లుబాటవుతాయా? న్యాయ సమీక్షకు అవి నిలుస్తాయా? అన్నది ఇప్పుడు ప్రశ్న. రద్దు నిర్ణయాన్ని ఖాతరు చేయకుండా ఆ ప్రదేశంలో చేరి, నిరసన తెలపడానికి యత్నించిన సిజెపి కార్యకర్తలు, ఇతర నిరసనకారుల్ని పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. వారిని నిర్బంధంలోకి తీసుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలపడం పౌరుల ప్రజాస్వామిక హక్కు అని, వారిని నిర్బంధించకూడదని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా పోలీసులు లెక్కచేయలేదు. 'జంతర్ మంతర్ వద్ద నిరసనల్ని నిషేధించాం కనుక అడ్డుకున్నాం' అన్నది పోలీసుల ధీమా కావచ్చు. కానీ, అలా ఏకపక్షంగా నిరసనల్ని పూర్తిగా నిషేధించి, నిరసన స్థలాన్ని ఉన్న పళంగా మార్చడం సరికాదని తెలంగాణ హైకోర్టు ధర్మాసనం లోగడ తీర్పు చెప్పింది. హైదరాబాద్ నగరం నడిబొడ్డున, ఇందిరా పార్కు సమీపంలోని 'ధర్నా చౌక్'ను ఎత్తివేసి, నగర శివార్లకు బదలాయించిన రాష్ట్ర ప్రభుత్వ చర్యని హైకోర్టు 2018 నవంబర్‌లో తప్పుబట్టింది. రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన 'ధర్నా చౌక్'ని కోర్టు పునరుద్ధరించింది. ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్ రావు, వి.హన్మంతరావు (కాంగ్రెస్), చాడ వెంకటరెడ్డి (సిపిఐ) తదితరుల ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) సుమోటోగా స్వీకరించిన హైకోర్టు, ప్రభుత్వ చర్యల్ని తప్పుబట్టింది. ధర్నా చౌక్ పునరుద్ధరణకు ముందు, తర్వాత కూడా పలుమార్లు న్యాయస్థానం కల్పించుకొని, పౌరుల నిరసనలకు ప్రత్యేకంగా అనుమతులు ఇప్పించింది. ట్రాఫిక్ అంతరాయాలు, స్థానికుల అసౌకర్యాలను పోలీసులు తమ నిర్ణయానికి కారణంగా చూపినప్పటికీ కోర్టు అంగీకరించలేదు. తమ అసంతృప్తిని వ్యక్తపరచడానికి, అందుకు శాంతియుతంగా గుమిగూడడానికి పౌరులు రాజ్యాంగబద్ధమైన హక్కును కలిగి ఉన్నారని హైకోర్టు ధర్మాసనం నవంబరు 2018 తీర్పులో స్పష్టం చేసింది. తాజా ఢిల్లీ పరిణామాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు, రోడ్ల దిగ్బంధనం, మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ నిలిపివేత, తీవ్ర నిర్బంధం వంటి సర్కారు చర్యల్ని సుప్రీం కోర్టు కూడా తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును హరించకూడదని స్పష్టం చేసింది. అయినా పోలీసులు నిరసనకారుల్ని అడ్డుకుంటూనే ఉన్నారు. జంతర్ మంతర్‌కు బదులు, దూరం గా మూడు స్థలాలను (రాంలీలా మైదాన్, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీ సిబిడి (గ్రౌండ్) ధర్నాలకు, నిరసనలకు ప్రత్యామ్నాయంగా చూపించామని ప్రభుత్వ పెద్దలంటున్నారు. దారులు మూయడమే ! ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థల్లో కొన్ని సమస్యలకు సంప్రదాయకమైన పరిష్కార పద్ధతులున్నాయి. అందులో సంప్రదింపులు, చర్చల ప్రక్రియ ఒకటి. ఆ పంథాకు పాలకులు మెలమెల్లగా దారులు మూసేస్తున్నారు. ఎవరితో చర్చించాలి? ఏం చర్చించాలి? అనే పెడసరపు మాటలు చెబుతున్నారు. ఏదైనా కీలక ప్రజా సంబంధ విషయంలో నిరసనకారులకు, సర్కారుకు మధ్య సయోధ్య బెడిసి, ఎడం పెరిగి, ప్రతిష్టంభన ఏర్పడినపుడు చర్చల ప్రక్రియ సాగేది. ప్రభుత్వం తరపున కొందరు పెద్దలు, నిరసన ఆందోళన కారుల తరపున కొందరు చర్చల్లో పాల్గొనేది. ఆ ఆనవాయితీయే కనుమరుగవుతోంది. అంతెందుకు నిన్నటికి నిన్న 'నీట్' పేపర్ లీక్ నిరసనల సందర్భంగా పరిస్థితి విషమించినప్పుడు కేంద్ర మంత్రులు చొరవ తీసుకొని సిజెపి ప్రతినిధులతో చర్చలు జరిపారు. విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ కార్యరూపం దాల్చి నిరసన ఉపసంహరణ అన్నది సదరు చర్చల ఫలితంగా జరిగిందే! మరి తాజా వివాదంలో.. పరిస్థితి ఇంతదాకా వస్తుందని సర్కారు వ్యూహకర్తలు ముందు భావించినట్టు లేదు. ఇసిలో జరిగిన తప్పిదాలను గుర్తించడానికి, గుర్తించినా అంగీకరించడానికి సిద్ధపడలేదు. దాంతో తప్పును సరిదిద్దుకునే ఆలోచనే చేయడం లేదు. ఫలితంగా సమస్య పరిష్కారమయ్యే సూచనలు కనబడటం లేదు. శాంతియుత నిరసన హింస కిందకు మళ్లే ఆస్కారం లేనపుడు కూడా పోలీసులు కర్కశంగా నిరసనల్ని అణచివేస్తున్నారన్నది ఆందోళనకారుల ఆరోపణ. సందర్భాన్ని, సన్నివేశాన్ని రిపోర్టు చేస్తున్న మీడియా ప్రతినిధులు, రిపోర్టర్లను కూడా పోలీసులు అడ్డుకుంటున్నారు. ప్రత్యర్థుల కింద జమచేస్తున్నారు. అదే సమయంలో సివిల్ దుస్తుల్లో వుండి లాఠీలతో నిరసనకారులపై దాడిచేస్తూ రెచ్చిపోతున్న వారిని, కార్లలో లాఠీలు, ఇతర ఆయుధాలతో నిరసన స్థలిలో తచ్చాడుతున్న వారిని పోలీసులు చూసీచూడనట్టు ఉపేక్షిస్తున్నారు. దీనిపట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శాంతి భద్రతల్ని కాపాడే తమ ప్రాథమిక బాధ్యతల్ని పోలీసులు ఔట్ సోర్సింగ్ చేశారా? కిరాయి గూండాల్ని అద్దెకు తెచ్చుకున్నారా? అనే వ్యంగ్య వ్యాఖ్య లూ ప్రజాక్షేత్రంలో వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతులకు తిలోదకాలిచ్చి, పెడపోకడలకు పాలకులు పీటలు వేస్తున్నారని సామాజికవేత్తలు విమర్శిస్తున్నారు. చట్టబద్ధ పాలన (రూల్ ఆఫ్ లా)కు కట్టుబడాల్సిన పోలీసులు సర్కారు కట్టుబానిసల్లా పనిచేయడమేకాక విధి నిర్వహణల్లో ఉన్న జర్నలిస్టుల్ని కూడా ఆందోళన, నిరసనకారుల్లో జమచేసే దారుణానికి ఒడిగడుతున్నారు.

'ఎల్‌నినో'తో పొంచి ఉన్న కరవు

ఈ ఏడాది నైరుతి పవనాల సీజన్‌పై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపడంతో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదై దక్షిణాది రాష్ట్రాల్లో తాగునీటికి కొరత ఏర్పడడమే కాకుండా, కరవు పరిస్థితులు తాండవిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంది. అయినప్పటికీ అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు దక్షిణ భారతంలో ఈశాన్య రుతుపవనాల వల్ల వర్షాలు కురియవచ్చన్న ఆశ కనిపిస్తోంది. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిశాయి. ఒడిశాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. 2015 తరువాత ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాల తీరు చాలా బలహీనంగా కనిపించింది. ఎల్‌నినో బలపడుతుండడంతో వర్షపాతం మరింత తగ్గే పరిస్థితి కనిపిస్తోందన్న హెచ్చరికలు వెలువడ్డాయి. వర్షపాతం లోటు, అధిక వర్షానికి సంబంధించిన గణాంక అధ్యయనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. కరవు ప్రకటనలు చేయడానికి ఈ గణాంకాలు ప్రభుత్వానికి సహాయ పడతాయి. అయితే గణాంకాలు ఎంత ముఖ్యమైనా, వర్షాకాలం విఫలమైనప్పుడు కలిగే నష్టాలను తగ్గించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చురుకుగా చర్యలు తీసుకోకుంటే వాటివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ప్రస్తుత కరవు పరిస్థితులను ఎదుర్కోవడం అధికార యంత్రాంగానికి ఒక సవాలే. అయితే రాబోయే పరిస్థితులు మరింత కష్టతరంగా ఉంటాయని, సాధారణం కంటే ఎక్కువ వేడితో వేసవి వస్తుందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. ఈ సంవత్సరం ఏర్పడిన ఎల్‌నినోను కొందరు 'సూపర్', 'సూపర్ డూపర్' అని పిలుస్తున్నా గతంలో జరిగిన ఎల్‌నినోలతో పోలిస్తే ఈ ఎల్‌నినోతో అంతటి విపత్తు సంభవించకపోవచ్చు. ఉదాహరణకు బ్రిటిష్ పాలనా కాలంలో 1877లో సంభవించిన తీవ్రమైన కరువుకు ఎల్‌నినో కూడా ప్రధాన కారణమైంది. ప్రస్తుతం భారత దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు తగినంత ఉన్నాయి. దేశంలో సుమారు 602 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు, బియ్యం నిల్వలు ఉన్నాయి. ఇది ప్రభుత్వం నిర్దేశించిన కనీస నిల్వల పరిమాణానికి మూడు రెట్లు ఎక్కువ. అందువల్ల వాతావరణ శాస్త్రవేత్తల్లో కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టుగా వరుసగా రెండో సంవత్సరం కూడా నైరుతి పవనాలు విఫలమైనా దేశంలో ఆహార కొరత పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ దేశం లోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 15 ప్రాంతాలకు చెందిన భూభాగంలో, దేశం మొత్తం భూభాగంలో సుమారు 40 శాతం విస్తీర్ణానికి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడం

ఆందోళన కలిగించే విషయం. నైరుతి పవనాల సీజన్ అధికారికంగా అక్టోబర్ 30న ముగుస్తుంది. కానీ ఈలోగా దేశంలోని మొత్తం 741 జిల్లాల్లో 313 జిల్లాల్లో తీవ్ర వర్షపాతం లోటు నమోదైంది. అంటే ఈ జిల్లాల్లో సాధారణంగా కురవాల్సిన వర్షపాతం కంటే 20 శాతం లేదా అంతకంటే తక్కువ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తీవ్రమైన కరువు కోరల్లో చిక్కుకున్నాయి. కర్ణాటకలో వర్షపాతం లోటు 35 శాతం కాగా, మొత్తం 240 తాలూకాల్లో 217 తాలూకాలను కరవు ప్రాంతాలుగా కర్నాటక ప్రకటించింది. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డిఆర్‌ఎఫ్) నుంచి రూ. 11,000 కోట్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 53 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ఆ రాష్ట్రం లోని మొత్తం 688 మండలాల్లో 388 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించింది. అంతర్ మంత్రిత్వశాఖల బృందం ఆయా రాష్ట్రాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నప్పుడు పరిశీలించి నివేదిక ఇచ్చిన తరువాత ఆయా రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా సహాయం అందజేయవలసిన అవసరం ఉంది. కానీ ప్రస్తుత కరవు పరిస్థితులకు ఎల్‌నినో ఎంతవరకు ప్రత్యక్ష కారణమో, దాని ప్రభావం ఎంత బలంగా ఉందో శాస్త్రీయంగా వివరించే అధ్యయనం ఇంకా పూర్తి కాలేదు. గతంలో కరవు ప్రకటనలు తరచుగా అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలు, అంచనాలపై ఆధారపడి ఉండేవి. కానీ 2009 సంవత్సరం నుంచి కరవు నిర్వహణ మాన్యువల్, దానికి చేసిన సవరణలు, ఆర్థిక సంఘాల నిర్ణయాలు కరువు ప్రకటనల ప్రక్రియను మరింత కఠినతరం చేశాయి. గతంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ నుంచి ఆర్థిక సాయం విడుదల చేయడంలో కేంద్రం అనేక సార్లు తీవ్ర జాప్యం చేయడమే కాక, సహాయం అందించడానికి నిరాకరించే సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 2024లో కర్ణాటక విషయంలో ఇలాంటి పరిస్థితి ఎదురైంది. రాష్ట్రప్రభుత్వాలే తమ సొంత నిధులను వెచ్చించుకోవలసి వచ్చింది. కేంద్ర బృందం పరిశీలించిన తరువాత కూడా సాయం అందించడంలో మొండి చెయ్యిచూపడం తగదు. రాష్ట్రాలను ఇబ్బందుల పాలు చేయడం, సహాయం అందించడంలో అనవసరమైన అడ్డంకులు సృష్టించే విధానాలు మానుకోవాలి. సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉన్నప్పుడు కరవును తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా రాష్ట్రాలను ఆదుకోవడానికి సిద్ధం కావాలి. రైతుల అప్పుల భారాన్ని తగ్గించడం, భూమి యాజమాన్యం లేని రైతులు, వ్యవసాయ కూలీలకు సహాయం అందజేయడం రాష్ట్రాల బాధ్యత అయినప్పటికీ రాష్ట్రాలకు ఆ మేరకు నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. కరవు సమస్యను ఎదుర్కోవడానికి కేవలం పెద్ద నీటి పారుదల ప్రాజెక్టులపై ఆధారపడకుండా, నీటి సంరక్షణ, తక్కువ నీటితో పండే పంటలు, వ్యవసాయ బీమా, రైతులకు ఆర్థిక సాయం వంటి స్థిరమైన పరిష్కారాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి.

కల్తీకి అయ్యే ఖర్చెంత?

మనిషి బతకడానికి తిండి కావాలి. తాగడానికి నీళ్లు, శ్వాసించడానికి గాలి కావాలి. ఆరోగ్యానికి పాలు, పోషణకు పండ్లు కావాలి. ఇవన్నీ ప్రకృతి ప్రసాదించిన వరాలు. కానీ ఇప్పుడు వీటిలో ఏది స్వచ్ఛమైనది? ఏది నిర్భయంగా తినదగినది? ఏది నిశ్చింతగా తాగదగినది? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేని దుస్థితి నెలకొంది. ఆకలి తీర్చే ఆహారమే అనారోగ్యానికి మూలమైతే, దాహం తీర్చే నీరే రోగాలను ఆహ్వానిస్తే, ప్రాణ వాయువే ఆరోగ్యానికి శత్రువైతే మనిషి తన మనుగడను ఎక్కడ వెతుక్కోవాలి? అసలు కల్తీకి అయ్యే ఖర్చెంత? లీటరు పాలలో నీళ్లు కలపడానికి అయ్యే ఖర్చెంత? నూనెలో నాణ్యతలేని పదార్థాలు కలిపి అమ్మడానికి పెట్టుబడెంత? పండ్లను కృత్రిమంగా మగ్గించడానికి వ్యయమెంత? ఆహార పదార్థాలకు ఆకర్షణీయమైన రంగులు అద్ది, వాటి అసలు స్వరూపాన్ని దాచడానికి ఖర్చెంత? కల్తీ ద్వారా వచ్చే అదనపు ఆదాయం ఎంత? ఈ లెక్కలన్నీ వేసుకునే వ్యాపారులు, ఆ కల్తీ వల్ల ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాన్ని ఎందుకు లెక్కించరు? పాల కల్తీ మరింత ఆందోళనకరమైన అంశం. సహజమైన పాలను పోలిన రూపం, చిక్కదనం తీసుకురావడానికి యూరియా, డిటర్జెంట్లు, ఇతర రసాయనాలను ఉపయోగించి కృత్రిమ పాలు తయారు చేసే ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. యూరియా వ్యవసాయానికి ఉపయోగపడే పదార్థమే అయినా, దానిని పాలలో కలిపి వినియోగించడం ప్రమాదకరం. పోషకాహారంగా భావించి పిల్లలకు ఇచ్చే పాలే హానికరమైన మిశ్రమంగా మారితే తల్లిదండ్రులు ఎవరిని నమ్మాలి? పసిపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంతో చెలగాటమాడే ఈ దుర్మార్గాన్ని అరికట్టడానికి నిరంతర తనిఖీలు, శాస్త్రీయ పరీక్షలు, కఠిన చర్యలు ఎందుకు సమర్థంగా అమలుకావడం లేదు? కల్తీ వ్యాపారికి అది లాభం కావచ్చు. వినియోగదారుడికి మాత్రం కనిపించని నష్టం. లాభం ఒకరి జేబులో చేరితే, నష్టం మరొకరి ఆరోగ్యంపై పడుతోంది. కల్తీ ద్వారా సంపాదించిన డబ్బు వ్యాపారికి మిగులుతుంది. అనారోగ్యంతో బాధపడే వ్యక్తి మాత్రం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ సంపాదనను కోల్పోతాడు. కుటుంబం వైద్య ఖర్చులతో ఆర్థికంగా కుంగిపోతుంది. నాణ్యతను పణంగా పెట్టి లాభాలు పెంచుకోవడం వ్యాపార చాతుర్యం కాదు; ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే దురాశ. కల్తీ సమస్య పాలకో, నూనెకో పరిమితమై ఉంటే నియంత్రించడం సులభమయ్యేది. కానీ పండ్లు సహజంగా పండాయా, కృత్రిమంగా మగ్గించారా అన్న సందేహం. కూరగాయల్లో రసాయనాల అవశేషాలున్నాయా అన్న భయం. తాగునీటిలో పారిశ్రామిక వ్యర్థాలు చేరాయా అన్న ఆందోళన. మరోవైపు వాహనాల పొగ, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణాల ధూళి గాలిని కలుషితం చేస్తున్నాయి. ఉద్దేశపూర్వక కల్తీ, నాణ్యతా

లోపం, పర్యావరణ కాలుష్యం వేర్వేరు సమస్యలే అయినా, వాటి ప్రభావం చివరకు ప్రజల ఆరోగ్యంపైనే పడుతోంది. తినే పదార్థం నుంచి పీల్చే గాలి వరకు అనుమానించాల్సి వస్తే, ఆధునిక జీవితం మనకు అందిస్తున్న భద్రత ఏమిటి? స్వచ్ఛమైన వస్తువును ఎంచుకోవడానికి కూడా అదనంగా డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి మరో విషాదం. సేంద్రియ పద్ధతుల్లో పండించామని చెప్పే ఉత్పత్తులు అధిక ధరలకు అమ్ముడవుతున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం సంపన్నుల ప్రత్యేక హక్కుగా మారాలా? నాణ్యమైన ఆహారం కొనలేని పేదవాడు కల్తీకి బలి కావాల్సిందేనా? స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం కోసం ప్రజలు అదనపు వ్యయం చేయాల్సి రావడం అభివృద్ధికి నిదర్శనమా? లేక అభివృద్ధి నమూనాలోని లోపాలకు అద్దమా? ప్రకృతిలో కల్తీలేని వస్తువులు లభించడం అసాధ్యమేమీ కాదు. ఆరోగ్యకరమైన నేల, కలుషితం కాని నీరు, బాధ్యతాయుతమైన వ్యవసాయ పద్ధతులు స్వచ్ఛమైన ఆహారానికి పునాదులు. పంట పండిన తర్వాత నిల్వ, రవాణా, విక్రయాల్లోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. సేంద్రియమనే ముద్ర ఉన్నంత మాత్రాన ప్రతి వస్తువూ సురక్షితమని భావించకుండా, శాస్త్రీయ పరీక్షలు, ధ్రువీకరణకు ప్రాధాన్యమివ్వాలి. ప్రకృతిని కాపాడకుండా స్వచ్ఛతను ఆశించడం సాధ్యం కాదు. ప్రభుత్వ బాధ్యత ఇక్కడ అత్యంత కీలకం. ఆహార భద్రతా చట్టాలు కాగితాలకే పరిమితం కాకూడదు. కల్తీని గుర్తించే ప్రయోగశాలలు, నిపుణులు, తనిఖీ వ్యవస్థలు బలోపేతం కావాలి. పరీక్షా ఫలితాలు వేగంగా వెల్లడించాలి. నేరాలకు పాల్పడినవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. కల్తీ పదార్థాలను మార్కెట్ నుంచి ఉపసంహరించుకోవాలి. పలుకుబడి ఉన్నవారు తప్పించుకునే అవకాశాలు లేకుండా చూడాలి. ప్రజల ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను బహిరంగపరచాలి. తనిఖీలు అప్పుడప్పుడు జరిగే తంతుగా కాకుండా నిరంతర పర్యవేక్షణలో భాగం కావాలి. ప్రజల అప్రమత్తత కూడా అవసరమే. ప్యాకేజీలపై తయారీ, గడువు, నాణ్యతా వివరాలను పరిశీలించాలి. అనుమానాస్పద పదార్థాల గురించి అధికారులకు తెలియజేయాలి. అయితే వినియోగదారుడి జాగ్రత్త మాత్రమే పరిష్కారం కాదు. ఏది కల్తీ, ఏది స్వచ్ఛమో గుర్తించే శాస్త్రీయ సామర్థ్యం అందరికీ ఉండదు. నాణ్యతను నిర్ధారించే వ్యవస్థను నిర్మించడం ప్రభుత్వ బాధ్యత; దాన్ని కాపాడటం ఉత్పత్తిదారుల బాధ్యత. అంతిమంగా మనం వేసుకోవాల్సిన ప్రశ్న ఒక్కటే. కల్తీని అరికట్టడానికి అయ్యే ఖర్చెంత? కల్తీని నిర్లక్ష్యం చేయడంవల్ల సమాజం చెల్లిస్తున్న మూల్యం ఎంత? తనిఖీ వ్యవస్థను బలోపేతం చేయడానికి పెట్టే నిధుల కంటే అనారోగ్యం, వైద్య ఖర్చులు, కోల్పోయిన పని దినాల రూపంలో దేశం భరిస్తున్న భారం తక్కువా? కల్తీని నిరోధించడానికి ఖర్చు చేయడం ప్రభుత్వానికి భారంగా కనిపించవచ్చు. కానీ దానిని నిర్లక్ష్యం చేయడం సమాజానికి అంతులేని భారంగా మారుతుంది. ప్రకృతి మనకు గాలిని అమ్మలేదు. నీటిలో విషం కలిపి ఇవ్వలేదు. పండ్లను కృత్రిమంగా మగ్గించి పంపలేదు. ఇవన్నీ మనిషి స్వార్థంతో సృష్టించుకున్న సమస్యలు. ప్రకృతి ఇచ్చిన వరాలను వ్యాపార దురాశకు బలిచేసి, ఆ తర్వాత స్వచ్ఛత కోసం అదనపు ధర చెల్లించే స్థితికి చేరుకోవడం నాగరికత సాధించిన ఘనత కాదు. కల్తీలేని ఆహారం విలాసం కాదు. స్వచ్ఛమైన నీరు ప్రత్యేక సౌకర్యం కాదు. కాలుష్యంలేని గాలి సంపన్నులకే దక్కాల్సిన హక్కు కాదు. ఇవి ఆరోగ్యంగా జీవించడానికి అవసరమైన కనీస హక్కులు. కల్తీ వ్యాపారి సంపాదించే అదనపు లాభం కంటే, కల్తీని అరికట్టలేక సమాజం కోల్పోతున్న ఆరోగ్యమే ఎన్నో రెట్లు ఖరీదైనది. ఆ మూల్యాన్ని ఇప్పటికైనా గుర్తించాలి. లేదంటే భావితరాలకు మనం అందించే వారసత్వం సంపద కాదు– అనారోగ్యం; ప్రకృతి కాదు– కలుషితం; జీవితం కాదు– జీవించడానికి నిరంతర పోరాటం.

మొబైల్ ఫోన్ల అధిక వినియోగంతో వెన్నునొప్పుల ముప్పు

హైదరాబాద్, అక్టోబర్ 15 (వార్త సంధ్య):
గంటల తరబడి ప్రయాణాలు, గుంతల రోడ్లు, ల్యాప్‌టాప్‌ల ముందు ఎక్కువసేపు కూర్చోవడం, మొబైల్ ఫోన్ల అధిక వినియోగం మెడ, వెన్నునొప్పులకు కారణం అవుతున్నాయని కేర్ హాస్పిటల్స్ వైద్యులు హెచ్చరించారు. అక్టోబర్ 16న ప్రపంచ వెన్నెముక దినోత్సవం సందర్భంగా కేర్ హాస్పిటల్స్ క్లినికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్, న్యూరో ఇంటర్వెన్షనిస్ట్, ఎండోస్కోపిక్ స్పైన్ సర్జన్ డాక్టర్ రణధీర్ కుమార్, హైటెక్ సిటీ కేర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ మినిమల్లీ ఇన్వాసివ్ అండ్ డిఫార్మిటీ స్పైన్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ గోపరాజు మాట్లాడుతూ సరైన భంగిమలో కూర్చోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ప్రయాణాల్లో విరామాలు తీసుకోవడం అవసరమన్నారు.

కదం తొక్కిన కార్మిక లోకానికి కృతజ్ఞతలు

-టిబిజికెఎస్ ఆర్జి త్రీ,ఏపీఏ ఉపాధ్యక్షులు నాగెల్లి

రామగిరి, అక్టోబర్ 15 (వార్త సంధ్య):
ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య మాట్లాడుతూ సింగరేణి కార్మిక వర్గం కేటీఆర్ సభతో గర్జించారని సింగరేణిలో జరిగే అన్యాయాలను కుంభకోణాలను తమ సంఘం చూస్తూ ఊరుకోదని కార్మికులకు కావలసిన పనిముట్లు గాని రక్షణ పరికరాలలో గాని అలసత్వం వహించే యాజమాన్యాన్ని ప్రశ్నిస్తామని సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం,సింగరేణికి రావలసిన బకాయిలను కొరకై కార్మికుల సంక్షేమ కార్యక్రమాల్లో కానీ అదేవిధంగా నెలకు రెండు మెడికల్ బోర్డు పెట్టే విధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతూ కార్మికుల ప్రతి సమస్యలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ముందు ఉంటుందని కార్మికులకు తెలియజేస్తూ నిన్నటి సభను విజయవంతం చేసిన కార్మిక వర్గానికి, బహిరంగ సభకు వచ్చిన పరిసర ప్రాంత ప్రజలకు అందరికీ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆర్జి త్రీ,ఏపీఏ డివిజన్ నాయకత్వం కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గామాత పూజలో పాల్గొన్న జిఎంలు

రామగిరి, అక్టోబర్ 15 (వార్త సంధ్య):
సింగరేణి అడ్రియాల లాంగ్ వాల్ గని నందు దుర్గామాత శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గురువారం చండీ హోమం, మహా ప్రసాద వితరణ,బోనాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు,వెంకట లక్ష్మి దంపతులు పాల్గొని దుర్గామాత కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నిర్వహించిన మహా ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమంలో గుర్తింపు , ప్రాతినిధ్య సంఘాల నాయకులు కొరిమి రాజ్ కుమార్,యం.రామచంద్ర రెడ్డి,కోట రవీందర్ రెడ్డి,అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్,ఎస్వోటు జిఎం యం.రామ్మోహన్,ఏరియా ఇంజినీర్ దూప్ సింగ్,ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్ధన్,మేనేజర్ పెంచలయ్య తో పాటు ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు,పిట్ కార్యదర్శులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో మహిళల పాత్ర కీలకం

-శిక్షణ పొంది ఉపాధి పొందాలి
-సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి

రామగిరి,అక్టోబర్ 15 (వార్త సంధ్య):
మహిళా రైతులు వ్యవసాయరంగంలో తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని డీపీఎం రవికుమార్,సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి సూచించారు.జాతీయ మహిళా రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) రామగిరి ఆధ్వర్యంలో గురువారం కల్వచర్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగంలో మహిళల ప్రాధాన్యం, స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి పొందే అవకాశాలను వివరించారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ మహిళలకు కుట్టు మిషన్లు,అగరబత్తుల తయారీ తదితర రంగాల్లో వారి ఆసక్తికి అనుగుణంగా అందిస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కేవీకే శాస్త్రవేత్తలు మహిళా రైతులకు వ్యవసాయంలో శ్రమను తగ్గించే సాంకేతికతలు,వివిధ శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.పొలాల్లో క్షేత్ర పరిశీలనలు నిర్వహిస్తూ మహిళా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.కేవీకేలో మిరపతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్నామని,ఆసక్తి ఉన్న మహిళలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.ఉద్యాన పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రణీత్‌కుమార్ ఉద్యాన పంటల ప్రాధాన్యం,వాటి ఉప ఉత్పత్తుల తయారీ,వాటి ద్వారా లభించే ఉపాధి అవకాశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా: శ్రీనివాస్,వెంకన్న,భాస్కరరావు, వినోద్‌కుమార్, నవ్య,ఏపీఎం పద్మ, సీసీ శ్రీధర్,మహిళా రైతులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు వరాల జల్లు!

-ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ డా.జనక్ ప్రసాద్ కృషి ఫలితం
-కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్

రామగిరి,అక్టోబర్ 15 (వార్త సంధ్య):
సింగరేణి ఆర్జీ3 ఏరియా,ఓసి1 ఆపరేషన్ సైట్ ఆఫీస్ నందు ఐఎన్టీయూసీ శ్రేణుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు వరాల జల్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఉదయం మొదటి షిఫ్ట్ ప్రారంభంలో ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు.ఈ గేట్ మీటింగ్ కు ఐఎన్టీయూసీ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో భాగంగా సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ అడ్వైసరీ బోర్డ్ చైర్మన్ డాక్టర్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తున్న ఏకైక యూనియన్ ఐఎన్టీయూసీ మాత్రమేనని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఎన్టీయూసీ నాయకులు, ధర్మపురి, వడ్డేపల్లి దాసు,ఆర్జీ3 ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఏరియా సెక్రటరీ శ్రీనివాసరావు, ఓసి1 పిట్ కార్యదర్శి తోకల ప్రవీణ్ రెడ్డి, సీహెచ్పీ పిట్ సెక్రెటరీ కిషన్ నాయక్, ఐఎన్టీయూసీ నాయకులు యం.ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ సలీం, నరేష్ కుమార్, రవికుమార్, గంధం శ్రీనివాస్, సాతిని నాగరాజు, లక్ష్మణాచారి, చంద్రయ్య, జంజర్ల తిరుపతి మరియు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.సానుకూలంగా స్పందించి పలు సమస్యలపై ప్రకటనలు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ నాయకులు పాలాభిషేకం చేశారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట...

-మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

రామగిరి,అక్టోబర్ 15 (వార్త సంధ్య):
గురువారం ప్రజా భవన్ ప్రెస్ మీట్ లో ఐటి పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సింగరేణి కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరుతాం అని అన్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మా ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 3189 పోస్టులను భర్తీ చేశాం అని,సింగరేణి ఉద్యోగి సొంతింటి కలను సహకారం చేశామని,పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సింగరేణి కోసం,సింగరేణి కార్మికుల కోసం చేసిందేంలేదు అని అన్నారు.అనంతరం రాష్ట్ర ప్రజలందరికీ ముందస్తు సద్దుల బతుకమ్మ,దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

పాత టెండర్ విధానాన్ని కొనసాగించాలని జిఎం కు వినతి

-ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న

రామగిరి,అక్టోబర్ 15 (వార్త సంధ్య):
ఆర్జి త్రీ ఓ సి పి వన్, సిహెచ్ పి పేస్ 2 బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికుల పాత టెండర్లు రోజుకు 20 మంది ఉండే విధంగా ఉన్న టెండర్ ను నేడు కొత్తగా పిలిచిన టెండర్ ను 13 మందికి పిలవడం వల్ల ఇక్కడ పనిచేస్తున్న 27 మంది కార్మికులు ఉండడం వల్ల మాస్టర్లు రాక ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని తిరిగి మ్యాన్ పవర్ పెంచాలని కోరుతూ గురువారం ఆర్జీ త్రీ జిఎం మధుసూదన్ కు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మెమోరాండం ఇచ్చి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తిరుపతి,మల్లయ్య, రామకృష్ణ,శ్రీనివాస్, మోహన్,శ్రీనివాస్, రాజబాబు, శంకరయ్య, పర్వతాలు,తదితర కార్మికులు పాల్గొన్నారు.

ఎస్ వి సూపర్ మార్కెట్ కు 50 వేల జరిమానా విధించిన మున్సిపాలిటీ

మంథని, అక్టోబర్ 15 (వార్త సంధ్య):
మంథని మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ శాఖ నుంచి తప్పనిసరిగా పొందాల్సిన వ్యాపార లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న ఎస్వి మార్ట్ ఇంటర్నేషనల్ అండ్ సూపర్ మార్కెట్ షాపుకు మున్సిపల్ శాఖ అధికారులు గురువారం రూ.50 వేలు జరిమానా విధించారు. ఆ షాప్ ను గత రెండు సంవత్సరాలుగా వ్యాపార లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విషయమై పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఇప్పటివరకు లైసెన్స్ పొందకపోవడంతో రూ.50 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కమీషనర్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మంథని మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా మున్సిపల్ శాఖ నుంచి వ్యాపార లైసెన్స్ పొందాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించే వారిపై ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారస్తులందరూ తమ వ్యాపారాలకు అవసరమైన లైసెన్సులను తప్పనిసరిగా పొందాలని, మున్సిపల్ నిబంధనలను పాటిస్తూ వ్యాపారాలు నిర్వహించాలని కమీషనర్ సూచించారు..

వార్తసంధ్య
www.vaarthasandhya.com

భారత్‌ను వదిలి వెళ్లిపో

నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసుల నోటీస్

న్యూఢిల్లీ అక్టోబర్ 15 (వార్త సంధ్య):
భారతదేశాన్ని వదిలి వెళ్లిపోవాలంటూ నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసులు నోటీస్ జారీ చేశారు. దీనికి ఈ నెల 28వ తేదీని డెడ్‌లైన్‌గా విధించారు. సీఈసీ రాజీనామా కోరుతూ అక్టోబర్ 10న ముంబైలోని క్రాంతిమైదానంలో జరిగిన నిరసనలో ఇమ్రాన్ పాల్గొన్నారు. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జూలై 22, 23 తేదీల్లో సీజేపీ జరిపిన ఆందోళనలో కూడా ఆయన పాల్గొన్నారు. ముంబైలో ఆందోళన తర్వాత అతడిని, గర్ల్‌ఫ్రెండ్, నటి లేఖా వాషింగ్టన్, కజిన్ జైన్ మేరీఖాన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఇమ్రాన్ ఖాన్ భారతీయుడు కాదని, భారత పౌరసత్వం లేకున్నా మన దేశంలో జరిగిన ఆందోళనలో పాల్గొని వీసా, వలస చట్టాలను అతిక్రమించాడని ముంబై పోలీసులు తెలిపారు.

మహిళపైనా 'గ్యాంగ్ రేప్' కేసుపెట్టొచ్చు

ఢిల్లీ హైకోర్టు చరిత్రాత్మక తీర్పు

న్యూఢిల్లీ అక్టోబర్ 15 (వార్త సంధ్య):
ఒక మహిళ స్వయంగా లైంగిక చర్యకు పాల్పడకపోయినా బాధితురాలిపై జరిగిన అత్యాచారానికి సహకరించినప్పుడు క్రిమినల్ చట్టం ప్రకారం ఆమెపై సామూహిక లైంగిక దాడి కేసును నమోదు చేయవచ్చని ఢిల్లీ హైకోర్టు గురువారం ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. గతంలో సామూహిక లైంగిక దాడికి సహకరించిన మహిళలు తీవ్రమైన ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి వీలు కల్పించిన చట్టంలోని లొసుగును ఈ తీర్పు పరిష్కరించింది. ఒక మహిళ తన మైనర్ కుమార్తెను మరో నిందితుడితో లైంగిక సంబంధం కలిగి ఉండేలా బలవంతం చేసిందనే ఆరోపణలకు సంబంధించిన కేసులో ఈ తీర్పు వెలువడింది. ఈ నేరంలో భాగస్వామిగా ఉన్న తల్లిపై అభియోగాలు నమోదు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ కోర్టు ఈ తీర్పును వెలువరించింది. ఒక మహిళపై ఐపీసీ సెక్షన్ 376డీ, బీఎన్ఎస్ సెక్షన్ 70 కింద సామూహిక లైంగిక దాడి నేరాన్ని మోపలేమని చెప్పడానికి ఎటువంటి ఆధారం లేదని ఈ కోర్టు భావిస్తున్నది. ప్రస్తుత తీర్పులో లేవనెత్తిన ప్రశ్నకు ఇదే సమాధానం అని హైకోర్టు పేర్కొంది.

11 మందికే అనుమతి

న్యూఢిల్లీ అక్టోబర్ 15 (వార్త సంధ్య):
ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఈ నెల 16న నిర్వహించే ఆందోళనకు భారీగా పౌరులు తరలి రావాలని సీజేపీ పిలుపునిచ్చిన క్రమంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. శుక్రవారం నాటి నిరసనకు పౌరులు తరలి రావద్దని ఢిల్లీ పోలీసులు గురువారం విజ్ఞప్తి చేశారు. ఆ రోజు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో తగిన ప్రదేశంలో జాతీయ జెండాలను పట్టుకుని జాతీయగీతం పాడేందుకు 11 మంది బృందానికి తాము సౌకర్యాలు కల్పించగలమని, ఈ నిరసనలో ప్రజలు పాల్గొనవద్దని వారు కోరారు. కన్నాట్‌ప్లేస్, పరిసరాల్లో 163 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఆజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్టార్ లింక్ ఓ యుద్ధ సాధనం.. ఇరాన్ ప్రకటన

న్యూఢిల్లీ అక్టోబర్ 15 (వార్త సంధ్య):

ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కంపెనీ స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలపై కఠిన చర్యలు తీసుకొంటూనే ఉంటామని ఇరాన్ ప్రకటించింది. దాన్ని తమ దేశ శత్రువుల చేతిలో ఒక యుద్ధ ఆయుధంగా ఇరాన్ సీనియర్ సైబర్ అధికారి ఒకరు అభివర్ణించారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో తమ దేశానికి ఘర్షణ కొనసాగుతున్న నేపథ్యంలో స్టార్‌లింక్ ఇంటర్నెట్‌పై కఠిన పరిమితులు విధిస్తామని తెలిపారు.

వాయు కాలుష్య నివారణలో అట్టడుగున భారత్

న్యూఢిల్లీ అక్టోబర్ 15 (వార్త సంధ్య):
ప్రపంచ వాతావరణ, ఆరోగ్య కూటమి(జీసీహెచ్ఏ) తాజాగా విడుదల చేసిన ఆరోగ్యకరమైన జాతీయ నిర్ణీత సహకారం(ఎన్‌డీసీ) స్కోర్‌బోర్డ్ ప్రకారం భారత్ తన జాతీయ వాతావరణ ప్రణాళికలో ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమైంది. ఈ సంవత్సరానికి సంబంధించిన మదింపులో భారత్ 32కు గాను కేవలం 2 పాయింట్లు మాత్రమే సాధించి అట్టడుగు స్థానంలో నిలిచింది. ఈ నివేదిక ప్రకారం భారత్ ఉద్గారాల లక్ష్యాలు పారిస్ ఒప్పందానికి అనుగుణంగా లేవు. అవి మానవ ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. భారత్‌పై వాయు కాలుష్యం కారణంగా సంభవించే మరణాల భారం చాలా ఎక్కువగా ఉంది. అయినా భారత్ ఈ విషయాన్ని తన ఎన్‌డీసీ ప్రణాళికలో పేర్కొనలేదు.

ఇద్దరు బంగ్లాదేశీయులకు సౌదీలో మరణశిక్ష

రియాద్ అక్టోబర్ 15 (వార్త సంధ్య):
ఇద్దరు బంగ్లాదేశీయులకు సౌదీలో మరణశిక్ష విధించడం సంచలనంగా మారింది. సౌదీ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. పవిత్ర నగరమైన మక్కాలోని ఓ మసీదులో ఇద్దరు బంగ్లాదేశీ పౌరులు నజెరుల్ ఇస్లాం అబ్దుల్ బాసిర్, సితి అక్తర్ అనైతిక కార్యకలాపాలకు పాల్పడ్డారు. దీంతో ఇద్దరినీ భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. విచారణలో వీరిద్దరూ దోషులుగా తేలడంతో ఇస్లామిక్ చట్టం ప్రకారం మరణశిక్ష విధించారు. అయితే ఆ ఇద్దరు ఎలాంటి అనైతిక చర్యలకు పాల్పడ్డారో మాత్రం వివరించలేదు.

అమెరికా వర్సిటీలో మహిళపై లైంగిక దాడి

బయట నిలబడి పురుషుల కేరింతలు

న్యూఢిల్లీ: అక్టోబర్ 15 (వార్త సంధ్య):
అమెరికాలోని ఒక యూనివర్సిటీలో అత్యంత దారుణ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఓ 21 ఏండ్ల యువతిపై లైంగిక దాడి జరిగింది. న్యూయార్క్ పోస్ట్ కథనం ప్రకారం ఈ ఘటనలో పలువురు నిందితులు ఉన్నారు. బాధితురాలిపై బాత్‌రూమ్‌లో లైంగిక దాడి జరుగుతున్న సమయంలో మిగిలిన నిందితులు బయట ఉండి కేరింతలు కొడుతూ తమ వంతు కోసం వేచి ఉండటం అత్యంత దిగ్భ్రాంతికరంగా మారింది. షికాగో విశ్వవిద్యాలయం సమీపంలోని ఒక ఫ్రెటర్నిటీ పార్టీలో ఒక మహిళకు సంబంధించిన కేసును షికాగో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని స్థానిక మీడియా పేర్కొంది. మీడియా కథనం ప్రకారం బాత్‌రూమ్ బయట గుమికూడిన పలువురు పురుషులు కేరింతలు కొడుతూ, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తుండగా ఆ మహిళ లైంగిక దాడికి గురైంది. ఆ మహిళ విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థిని కాదని పోలీసులు ధృవీకరించారు.

30 అడుగుల బొద్దింక దిష్టిబొమ్మ దహనం

న్యూఢిల్లీ అక్టోబర్ 15 (వార్త సంధ్య):
సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా సీజేపీ ఆందోళనలు నిర్వహిస్తున్న సమయంలో కీలక పరిణామం చోటుచేసుకున్నది. ఢిల్లీలో ప్రతి ఏటా రామ్‌లీలా కార్యక్రమంలో రావణాసురుడు,కుంభకర్ణుడు, మేఘనాథుడి దిష్టిబొమ్మలు దహనం చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఈ ముగ్గురి దిష్టిబొమ్మలతో పాటు 30 అడుగుల బొద్దింక దిష్టిబొమ్మను కూడా దహనం చేయనున్నారు. పితాంపురలో రామ్‌లీలా కార్యక్రమాన్ని నిర్వహించే శ్రీ కేశవ్ రామ్‌లీలా కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నది.

రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో టపాసులు కాల్చడంపై మహారాష్ట్రలో నిషేధం..

న్యూఢిల్లీ అక్టోబర్ 15 (వార్త సంధ్య):
దీపావళి పండుగ రాబోతున్న వేళ టపాసులు కాల్చడంపై మహారాష్ట్రకు చెందిన బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రోడ్ల మీద, బహిరంగ ప్రదేశాలలో, ప్రజలు ఎక్కువగా ఉండే ప్రదేశాలలో టపాసులు కాల్చడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మహారాష్ట్రవ్యాప్తంగా ఈ నిర్ణయం అమలవుతుందని తెలిపింది. ఈ అంశంపై గురువారం ఆదేశాలు జారీ చేసింది. దీపావళి, ఇతర పండుగల సందర్భంగా టపాసులు కాల్చడం వల్ల జరుగుతున్న వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని కోర్టు తాజా ఆదేశాలు జారీచేసింది. జస్టిస్ గిరీష్ కులకర్ణి, జస్టిస్ నీలా గోఖలే ఆధ్వర్యంలోని బెంచ్ ఈ ఆదేశాలు ఇచ్చింది. ఇదే సమయంలో డీజేల వినియోగం, లౌడ్ స్పీకర్లు, డాల్బీ సౌండ్ సిస్టమ్స్, లేజర్ లైట్లపై కూడా స్పందించింది. వీటి వాడకం విషయంలో తగిన నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వానికి సూచనలు చేసింది. ఈ అంశంలో వారంలోగా స్పందించి, కఠిన చర్యలు

అమలులోకి తేవాలని సూచించింది. పండుగల సందర్భంగా టపాసులు, సౌండ్ సిస్టమ్స్ వంటి వాటివల్ల తలెత్తుతున్న ఇబ్బందులపై దాఖలపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ సందర్భంగా కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఏ తరహా టపాసులు విక్రయించాలి.. వాటి తయారీలో నిబంధనలు వంటి వాటిపై స్పందించేందుకు కోర్టు నిరాకరించింది. గత నెలలో జరిగిన గణేష్ ఉత్సవాల సందర్భంగా కూడా కీలక ఆదేశాలు జారీ చేసింది. వినాయక ఉత్సవాల సందర్భంగా టపాసులు కాల్చవద్దని సూచించింది. తాజాగా స్పందించిన కోర్టు.. టపాసుల వల్ల వెలువడే విష వాయువులతో వృద్ధులు, పిల్లలు, రోగులు ఇబ్బంది పడతారని కోర్టు వ్యాఖ్యానించింది. కాలం మారుతోందని.. ఇప్పుడు ఈ విషయంలో మారాల్సిన తరుణం వచ్చిందని కోర్టు అభిప్రాయపడింది. ఇదే సమయంలో టపాసుల తయారీ, విక్రయాల వల్ల ఎందరికో ఉపాధి దొరుకుతుందన్న విషయాన్ని కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. టపాసులు కాల్చే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రీన్ లేదా ఎకో ఫ్రెండ్లీ టపాసులు కాల్చేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించింది.

బీఎస్ఎఫ్ క్యాంప్‌లో ఫుడ్ పాయిజనింగ్..

- 75 మంది సిబ్బంది ఆస్పత్రిపాలు

అక్టోబర్ 15 (వార్త సంధ్య):
మణిపూర్, ఇంఫాల్‌లోని బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్) క్యాంపులో ఫుడ్ పాయిజనింగ్ జరిగింది. ఈ ఘటనలో దాదాపు 75 మంది బీఎస్ఎఫ్ జవాన్లు అస్వస్థతకు గురయ్యారు. వీరితోపాటు మరో ముగ్గురు పౌరులు కూడా అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వీరందరినీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స అందుతోంది. ఈ ఘటన గురువారం ఉదయం జరిగింది. ఉదయం బీఎస్ఎఫ్ జవాన్లు, ఇతర సిబ్బంది బ్రేక్‌ఫాస్ట్ చేశారు. ఆ తర్వాత కొద్ది సేపటికి ఆహారం తిన్న 78 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపునొప్పి వంటి లక్షణాలు మొదలయ్యాయి. దీంతో

వెంటనే వారిని అత్యవసర ప్రాతిపదికన స్థానిక రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. 78 మంది చికిత్స పొందుతుండగా.. వారి పరిస్తితి ప్రస్తుతం స్తిరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రాణాపాయం ఏమీ లేదన్నారు. అయితే, ఈ ఫుడ్ పాయిజనింగ్‌కు కారణం ఏంటనేది ఇంకా తెలియరాలేదు. అందరూ ఒకే ఆహారం తీసుకున్నారా.. వేర్వేరు పదార్థాలా అనేది కూడా తేలాలి. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. సంబంధిత ఆహార పదార్థాల్ని అధికారులు సేకరించారు. వాటి పరిశీలన అనంతరం ఈ ఘటనకు గల కారణాలు తెలియరావచ్చు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

లాయర్‌గా కీర్తి సురేష్.. ఆసక్తికరంగా 'సత్యవాన్ సావిత్రి' టీజర్!

నేషనల్ అవార్డ్ విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి' . ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్ తాజాగా విడుదలైంది. కామెడీ, కోర్టు డ్రామా మరియు లీగల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టీజర్‌తో భారీ అంచనాలు నెలకొన్నాయి.చిన్నప్పటి నుంచి లాయర్ కావాలనే కసితో, ఫ్యామిలీని ఎదురించి లా చదివిన 'సావిత్రి' అనే యువతి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తున్నారు. తను టేకప్ చేసిన తొలి కేసులో ఆమె ఎదుర్కొనే సవాళ్లు, కోర్టులో జడ్జిలకు ఆమె చేసే అమాయకపు వాదనలు టీజర్‌లో నవ్వులు పూయిస్తున్నాయి. ఈ చిత్రంలో మరో ప్రధాన ఆకర్షణ ప్రముఖ దర్శకుడు, నటుడు మిస్కిన్ కాగా, సావిత్రికి ఎదురుగా కోర్టులో వాదించే పవర్‌ఫుల్ లాయర్ 'మార్కండేయన్' పాత్రలో ఆయన కనిపించనున్నారు. కీర్తి సురేష్ మరియు మిస్కిన్ మధ్య జరిగే కోర్టు రూమ్ వార్ సినిమాకే హైలైట్‌గా నిలవనుంది. ఈ చిత్రంలో కీర్తి సురేష్, మిస్కిన్‌లతో పాటు చారుకేశ్, బాల శరవణన్, శిల్పా మంజునాథ్, బాలాజీ శక్తివేల్, ఆర్. సుందర్రాజన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తుండగా, అరుణ్ విన్సెంట్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జీ స్టూడియోస్ మరియు డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సీరియస్ కోర్టు రూమ్ డ్రామాను కూడా చక్కటి వినోదం, హ్యూమర్‌తో మిక్స్ చేసి తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 20, 2026 న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

యూట్యూబ్‌లో దూసుకుపోతున్న 'హైందవ' టీజర్.. రికార్డు స్థాయిలో వ్యూస్‌తో మాస్ రెస్పాన్స్!

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా, సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'హైందవ' అఫీషియల్ టీజర్ యూట్యూబ్‌లో రికార్డు స్థాయి స్పందనతో దూసుకుపోతోంది. లూధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టీజర్ విడుదలైన కేవలం 16 గంటల్లోనే 8,65,523 పైచిలుకు వ్యూస్‌ను సొంతం చేసుకుని ట్రెండింగ్‌లో నిలిచింది.రంగాపురం అనే గ్రామంలోని పురాతన ఆలయంలో పది దైవ విగ్రహాలు ఒక్కసారిగా మాయమవడం, అదే సమయంలో గ్రామంలో ఓ వ్యక్తి దారుణంగా హత్యకు గురికావడంతో ఈ కథ ప్రారంభమవుతుంది. ఈ మిస్టరీ మరియు క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌ను చేధించడానికి దేవుడి కంటే మానవత్వం, హేతువాదంపై నమ్మకం ఉండే ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ రగ్గడ్ లుక్‌లో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఈ చిత్రంలో మహేష్ మంజ్రేకర్ ఆలయ పూజారిగా నటిస్తుండగా, సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మూన్‌షైన్ పిక్చర్స్ పతాకంపై మహేష్ చందు నిర్మిస్తున్నారు. ఆధ్యాత్మికత, క్రైమ్, నమ్మకాల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మిస్టికల్ డివోషనల్ థ్రిల్లర్ చిత్రాన్ని నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. టీసర్‌లో వచ్చే "జరగబోయేది చెప్పి.. అది ఎలా జరుగుతుందో కళ్లారా చూపించేవాడే దేవుడు" వంటి డైలాగ్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి.

కథలు నచ్చక.. కాస్త విరామం..!

మృణాల్‌ఠాకూర్

తొమ్మిది నెలలుగా తాను ఒక్క చిత్రాన్ని కూడా అంగీకరించలేదని అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్ స్పష్టం చేసింది. అల్లు అర్జున్ 'రాకా' చిత్రంలో ఈ భామ కీలక పాత్రను పోషిస్తుందనే వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మృణాల్ ఠాకూర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'గత తొమ్మిది నెలలుగా ఏ సినిమాకూ సంతకం చేయలేదు. ఆఫర్లు బాగానే వస్తున్నాయి. కానీ కథలు నా మనసుకు నచ్చడం లేదు.అందుకే సినిమాలకు విరామం తీసుకున్నా. ఒక సినిమా కోసం మూడునాలుగు నెలల సమయాన్ని వెచ్చించాల్సి వస్తున్నది. అంత సమయాన్ని కేటాయిస్తున్నామంటే కథలో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి కదా' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. 'రాకా' సినిమాలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నదని, ఆమె షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నదని ముంబై సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకూ చిత్రబృందం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

పుట్టినరోజున సాయిదుర్గా తేజ్ కొత్త సినిమా ప్రకటన..

'సేవ్ ది టైగర్స్' దర్శకుడితో మెగా హీరో!

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మెగా హీరో సాయిదుర్గా తేజ్ (సాయిధరమ్ తేజ్) తన తదుపరి సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న ఈ యువ హీరో, తన కెరీర్‌లో 19వ చిత్రానికి సంబంధించిన కీలక ప్రకటనతో అభిమానుల్లో ఆసక్తి పెంచారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించడంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, 'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తేజ కనుమ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సేవ్ ది టైగర్స్' సిరీస్‌కు దర్శకత్వం వహించిన తేజ కనుమతో సాయిదుర్గా తేజ్ సినిమా చేయబోతుండటం ఆసక్తికరంగా మారింది. కుటుంబ సంబంధాలు, హాస్యం, వినోదానికి ప్రాధాన్యమిచ్చే కథలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ దర్శకుడు.. ఇప్పుడు వెండితెరపై మెగా హీరోను ఎలా చూపించబోతున్నారనే చర్చ మొదలైంది. ఈ ఇద్దరి కలయికలో రూపొందనున్న సినిమా ఎలాంటి కథాంశంతో తెరకెక్కనుంది? సాయిదుర్గా తేజ్‌ను దర్శకుడు ఏ తరహా పాత్రలో చూపించనున్నారు? అనే వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది. చిత్రబృందం ప్రస్తుతానికి హీరో, దర్శకుడు, నిర్మాణ సంస్థకు సంబంధించిన వివరాలను ప్రకటించగా, మిగిలిన నటీనటులు, సాంకేతిక బృందం, సినిమా కథాంశంపై మరింత సమాచారం రావాల్సి ఉంది. సాయిదుర్గా తేజ్ కెరీర్‌లో ఈ చిత్రం 19వ సినిమాగా నిలవనుంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ ప్రాజెక్టును నిర్మిస్తుండటంతో సినిమాపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను చిత్రబృందం దశలవారీగా వెల్లడించే అవకాశం ఉంది. మరోవైపు సాయిదుర్గా తేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటిగట్టు' సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంపై కూడా అభిమానుల్లో అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానున్నట్లు సమాచారం. ఒకవైపు ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి సారిస్తూనే, మరోవైపు కొత్త సినిమాను ప్రకటించడం ద్వారా తన తదుపరి ప్రయాణానికి ఆయన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమా ప్రకటన రావడంతో అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 'సేవ్ ది టైగర్స్' దర్శకుడు తేజ కనుమతో సాయిదుర్గా తేజ్ చేయనున్న ఈ కొత్త చిత్రం ఎలాంటి వినోదాన్ని అందించనుంది? మెగా హీరోను దర్శకుడు ఏ కొత్త కోణంలో చూపించబోతున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే మరిన్ని అధికారిక వివరాలు వచ్చే వరకు వేచి చూడాలి.

రూ.2500 కోట్లకు పైగా వసూళ్లు..

ఓటీటీలోకి రాబోతున్న 'అబ్సెషన్ అన్‌కట్ వెర్షన్'

హాలీవుడ్‌తో పాటు వరల్డ్ వైడ్ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన హర్రర్ థ్రిల్లర్ 'అబ్సెషన్' డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. కర్రీ బార్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.2,500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి సినీ విశ్లేషకులను సైతం విస్మయపరిచింది. కేవలం రూ.9 కోట్ల బడ్జెట్‌తో రూపొంది, బాక్సాఫీస్ వద్ద అసాధారణ విజయాలను నమోదు చేసిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు వస్తోంది.ఈ చిత్రానికి సంబంధించిన 'అబ్సెషన్: ది ఒరిజినల్ అన్‌కట్ వెర్షన్' జియో హాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. అక్టోబర్ 30వ తేదీన సాయంత్రం 7 గంటల నుంచి ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా ఇంగ్లీష్‌తో పాటు హిందీ భాషల్లోనూ ఈ చిత్రం విడుదలవుతుండటంతో సినీ ప్రియులు దీన్ని వీక్షించేందుకు అమితాసక్తిగా ఎదురుచూస్తున్నారు. మైఖేల్ జాన్సన్, ఇందే నవారెట్టే ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్, థియేటర్లలోనే కాకుండా ఓటీటీలో కూడా సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతోంది.

అమ్మ కదిలి వచ్చే..



సంకల్ప్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. క్రీ.శ. 642 నాటి కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'అమ్మ కదిలి వచ్చే' పాటకు అనుదీప్‌దేవ్ సంగీతాన్నందించారు. కల్యాణ్‌చక్రవర్తి త్రిపురనేని ఈ పాటకు సాహిత్యాన్ని సమకూర్చారు.దుర్గాదేవి ఆరాధనలోని వైభవాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. ఇందులో శూలాంభ అమ్మవారి ఉత్సవ ఊరేగింపును చూపించారు. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి...వంటి అమ్మవారి తొమ్మిది రూపాలను ఈ పాటలో వేడుకగా చూపించడం ప్రధానాకర్షణగా నిలిచింది. నాయకానాయికలు గోపీచంద్, రీతూవర్మ ఈ పాటలో అద్భుతంగా కనిపించారు. ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్‌దేవ్, దర్శకత్వం: సంకల్ప్.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.